www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 208 | గురువారం | 9 జనవరి, 2025



## అది లైంగిక వేధింపే..

మహిళల శరీరంపై కామెంట్స్ చేస్తే నేరమే

కేరళ హైకోర్టు

.. వివరాలు 2లో




## ఇక ఆ బీరు బంద్..

కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు ప్రకటన

ప్రభుత్వం బేస్ ధర పెంచకపోవడంతో నష్టాలు అంటూ కంపెనీ వెల్లడి

.. వివరాలు 2లో

# తిరుపతిలో అపశ్రుతి

## వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల కోసం తోపులాట

- ఆరుగురు భక్తుల మృతి
- మృతుల్లో ఐదుగురు మహిళలు
- మరో 29 మందికి పైగా గాయాలు, ఆస్పత్రులకు తరలింపు
- క్షతగాత్రులకు టీటీడీ ఈవో, కలెక్టర్ పరామర్శ



**ప్రజానావ, తిరుపతి:** వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో అపశ్రుతి చోటు చేసుకుంది. టోకెన్ల కోసం ఊహించని రీతిలో భక్తులు రావడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. అస్వస్థతకు గురైన వారిని అంబులెన్స్‌ల్లో తిరుపతిలోని ఆసుపత్రులకు తరలించారు. రుయా ఆసుపత్రిలో 20 మంది, స్విమ్స్ 9 మంది చికిత్స పొందుతున్నారు. రుయా ఆస్పత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు చేరుకొని వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భక్తుల మధ్య తోపులాట జరిగింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని తొమ్మిది కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. అయితే, టోకెన్ల కోసం బుధవారం సాయంత్రమే భక్తులు భారీగా తరలివచ్చారు. తొక్కిసలాటలో గాయపడిన బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. తోపులాట జరిగిన ప్రాంతాలకు విజిలెన్స్, అదనపు పోలీసు బలగాలు భారీగా చేరుకున్నాయి. మరోవైపు, ఘటనా స్థలం వద్ద పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు నగర పాలక కమిషనర్ తెలిపారు.

**తొక్కిసలాటకు కారణమిదే..**

టోకెన్ల కోసం వచ్చిన భక్తులను రోడ్లపై గుమిగూడకుండా బైరాగిపట్టెడ వద్ద ఉన్న పద్మావతి పార్కులో ఉంచారు. అయితే, టోకెన్ల జారీ కేంద్రంలో సిబ్బంది ఒకరు అస్వస్థతకు గురికావడంతో అతన్ని ఆసుపత్రికి తరలించేందుకు క్యూలైన్ తెరిచారు. టోకెన్ల జారీ చేసేందుకు క్యూలైన్ ఓపెన్ చేశారని భావించిన భక్తులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్యూలైన్ల వద్ద సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదని మరి కొందరు ఆరోపిస్తున్నారు. టోకెన్ల కోసం ఎంతమంది భక్తులు

మిగతా 2 లో

### ఒక్కసారిగా గేట్లు తెరవడంతోనే..

- ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరం
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

02

### ఈ దుర్ఘటన కలచివేసింది

- భక్తులు మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు

02

## ఫార్ములా ఈ కార్ రేసు కేసు ఏసీబీ దూకుడు

- నిధుల విడుదలపై అరవింద్ కుమార్‌కు ప్రశ్నలు
- ఈడీ విచారణలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎన్ఎల్ రెడ్డి

02

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

### కొత్త పథకం ప్రకటించిన కేంద్రం


- గరిష్టంగా రూ.1.50 లక్షల ట్రీట్‌మెంట్
- ప్రమాదం జరిగిన మొదటి 7 రోజుల చికిత్సకే వర్తింపు
- మార్చి నాటికి దేశవ్యాప్తంగా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్
- హిట్ అండ్ రన్‌లో చనిపోతే, 2 లక్షల ఎక్స్‌గ్రేషియా
- కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని తీసుకువచ్చింది. నిత్యం చాలామంది రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోతుండగా.. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్డు ప్రమాద బాధితుల కోసం మోదీ సర్కార్ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్‌ను తీసుకువచ్చింది. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.2 లక్షలు.. గాయపడిన వారికి రూ.1.50 లక్షల వరకు ఖర్చులు కేంద్ర ప్రభుత్వమే భరించనుంది.

**న్యూఢిల్లీ:** కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే

మిగతా 2 లో



## భారత స్పేస్ స్టేషన్ కు గ్రీన్ సిగ్నల్

ఆమోదం తెలిపిన ప్రధాని మోదీ

పనులు వేగంగా చేయాలని సూచన

ఇస్రో కొత్త చీఫ్ వీ నారాయణన్ వెల్లడి

**తిరువనంతపురం :** ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష

మిగతా 2 లో

# మే 1 నుంచి కొత్త జాబ్ నోటిఫికేషన్లు

### ఐదు, ఆరు నెలల్లో నియామకాలు పూర్తి

- గ్రూప్-3 ప్రిలిమనరీ కీ విడుదల
- 12 వరకు అభ్యంతరాల స్వీకరణ
- టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం




హైదరాబాద్, జనవరి 8 : రాష్ట్రంలో 1,365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్ష ప్రిలిమినరీ కీని టీజీపీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు పేపర్లుగా నిర్వహించిన ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5.36లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 2,69,483 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్ 3 ప్రిలిమినరీ కీపై జనవరి 12 సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

మిగతా 2 లో

## కేటీఆర్‌కు మరోమారు చుక్కెదురు

- లాయర్‌తో విచారణ కుదరదన్న ధర్మాసనం
- కనుచూపు మేరలో లాయర్ ఉండేలా అనుమతి
- ఎసిబి విచారణకు సహకరించాలని సూచన



02



## 2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం

02

- అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష



## క్రీడాభివృద్ధికి సహకారం

### సిఎం రేవంత్‌తో పుల్లెల గోపీచంద్ భేటీ

**హైదరాబాద్, జనవరి 8 :** సిఎం రేవంత్ రెడ్డిని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పోర్ట్‌పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని గోపీచంద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మిగతా 2 లో

## ఏకకాలంలో తెలుగు రాష్ట్రాల్లో ఐటీ దాడులు

రియల్ లైఫ్ బంటి, బబ్లీ కేసులో సోదాలు

03



# తిరుపతిలో అపశ్రుతి

మొదటి పేజీ తరువాయి

వచ్చారు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అం దించలేదని తెలుస్తోంది. ఈ నెల 10, 11, 12 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లను గురువారం ఉదయం జారీ చేయాల్సి ఉంది. మిగిలిన రోజులకు సం బంధించి ఆయా తేదీల్లో తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో ఇవ్వనున్నట్టు టీటీడీ తెలిపింది. అయితే, భక్తుల రద్దీ కారణంగా ఇవాళ రాత్రి నుంచే టోకెన్లు జారీ చేస్తున్నట్టు ఈవో శ్యామలరావు తెలిపారు.

## గేట్లు ఒక్కసారిగా తెరవడంతోనే..

శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ కేంద్రం వద్ద దురదృష్టవశాత్తూ ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక సెంటర్‌లో మహిళా భక్తురాలు అపస్మారక స్థితికి చేరుకుంటుండగా డీఎస్పీ గేట్లు తీశారు. దీంతో ఒక్కసారిగా భక్తులు ప్రవేశించడంతో తొక్కిసలాట చోటుచేసుకొని భక్తులు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందిందని తెలిపారు. మరో 25 మంది వరకు క్షతగాత్రులు ప్రభుత్వ రుయా, స్విమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఛైర్మన్ వివరించారు. తిరుపతిలో పరిస్థితిని ఈవో జె.శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇందులో ఎటువంటి కుట్ర లేదని, ప్రమాదవశాత్తూ మాత్రమే జరిగిందన్నారు. గురువారం సీఎం చంద్రబాబు తిరుపతి వస్తారని, మృతులకు సంతాపం తెలపడంతోపాటు క్షతగాత్రులను పరామర్శిస్తారని తెలిపారు. మృతుల కుటుంబాలకు పరిహారం కూడా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి: పవన్

తిరుమల వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీకి సంబంధించి తొక్కిసలాట ఘటనపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. తిరుపతి ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'తిరుపతి ఘటనలో ఆరుగురు మృతి చెందారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యా. భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం చెందడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నా. క్షతగాత్రులకు సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించాలి'అని వైద్యారోగ్య శాఖకు సూచించాను' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఈ దుర్ఘటన కలచివేసింది

■ భక్తులు మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

**అమరావతి:** వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను ఎంతో కలచివేసిందన్నారు. అస్వస్థతకు గురైన బాధితులకు అందుతున్న వైద్యచికిత్సపై అధికారులతో సీఎం మాట్లాడారు. జిల్లా కలెక్టర్, టీటీడీ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు పర్యవేక్షించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు సీఎం చంద్రబాబు నేడు తిరుపతి వెళ్లనున్నారు. ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించనున్నారు. తిరుపతిలో జరిగిన తోపులాట ఘటనలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ఘటన జరిగిందన్నారు. తోపులాట ఘటనల్లో ఆరుగురు చనిపోయినట్లు తెలిపారు. ఇలాంటివి మరోసారి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. డీజీపీ, టీటీడీ ఈవో, కలెక్టర్, ఎస్పీతో సీఎం మాట్లాడారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

మొదటి పేజీ తరువాయి

ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

# మహిళల శరీరంపై కామెంట్స్ చేస్తే అది లైంగిక వేధింపే..

**కొచ్చి, జనవరి 8:** మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120(ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.

# స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో ఛైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మాక్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

# కింగ్‌ఫిషర్ బీర్ ప్రియులకు చేదువార్త




**హైదరాబాద్, జనవరి 8:** ఇది బీర్ ప్రియులకు పెద్ద షాక్.. ముఖ్యంగా కింగ్ ఫిసర్ బీర్‌ప్రేమికులకు మింగుడు పడదు. తెలంగాణకు కింగ్ ఫిషర్ల బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ బకాయిలు చెల్లించ కపోవడంతో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూబీఎల్ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది కానీ.. తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టా లు వస్తున్నాయని యూబీఎల్ తెలిపింది. బీర్ల సరఫరా నిలిపివేతకు ఇది కూడా ఒక కారణమని కంపెనీ పేర్కొంది. తెలంగాణ నుంచి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. ఈ జాప్యం కూడా కంపెనీ నష్టాలకు కారణమైందని తెలిపింది. ఈ విషయాన్ని సెబీకి లేఖ ధ్వారా తెలిపింది. కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్లను నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ స్పష్టం చేసింది. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో బీర్ల అమ్మకాలను పరిశీలిస్తే కింగ్ ఫిషర్ బ్రాండ్స్ 60 నుంచి 70 శాతం అధికంగా విక్రయం అవుతున్నట్లు తెలిపింది.

# క్రీడాభివృద్ధికి సహకారం అందిస్తా

**హైదరాబాద్,జనవరి8 :** సిఎం రేవంత్ రెడ్డిని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పోర్ట్‌పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని గోపీచంద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్పోర్ట్ యూనివర్సిటీ, స్పోర్ట్ అకాడమీ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభ పరిణామని గోపీచంద్ అభిప్రాయపడ్డారు. క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని గోపీచంద్ తెలిపారు.



# కేటీఆర్‌కు మరోమారు చుక్కెదురు

## లాయర్‌తో విచారణ కుదరదన్న ధర్మాసనం
## కనుచూపు మేరలో లాయర్ ఉండేలా అనుమతి
## ఎసిబి విచారణకు సహకరించాలని సూచన

**హైదరాబాద్, జనవరి 8 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఎసిబి విచారణలో లాయర్‌ను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే లాయర్ కనుచూపు మేరలో ఉండేలా మాత్రం హైకోర్టు అనుమతించింది. కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం మధ్యాహ్నం 4 గంటలకు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసు విచారణలో తనతోపాటు న్యాయవాది ఉండాలంటూ కేటీఆర్ కోరడాన్ని కోర్టు ఆక్షేపించింది. కేటీఆర్‌తోపాటు లాయర్ ఉండేందుకు హైకోర్టు నిరాకరించింది. విచారణ సమయంలో లాయర్‌తో కలిసి కూర్చునే అవకాశం లేదని తేల్చి చెప్పింది. సీసీ టీవీ పర్యవేక్షణ లేదా కేటీఆర్ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేందుకు అనుమతి ఇచ్చింది. ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నప్పుడు న్యాయవాది రాంచందర్‌రావు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేందుకు హైకోర్టు అంగీకరించింది. నేరుగా కేటీఆర్ పక్కన విచారణలో పాల్గొనేందుకు నిరాకరించింది. రేపు ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణపై అభ్యంతరాలు ఉంటే మళ్లీ కోర్టుకు రావొచ్చని తెలిపింది. విచారణ సందర్భంగా న్యాయమూర్తికి కేటీఆర్ వెంట వెళ్లే లాయర్ పేరును న్యాయవాది ప్రభాకర్ రావు తెలిపారు. కేటీఆర్ వెంట మాజీ అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు వెళ్తారని న్యాయమూర్తికి తెలిపారు. కేటీఆర్‌కు కనిపించే దూరంలో న్యాయవాది ఉంటారని జడ్జి చెప్పారు. కేటీఆర్‌ను ఒక గదిలో, లాయర్‌ను ఒక గదిలో కూర్చోబెట్టి.. విచారణ కనిపించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు ఏఏజీకి సూచించింది. లైబ్రరీ విండో నుంచి కేటీఆర్ విచారణను చూడొచ్చని ఏఏజీ కోర్టుకు తెలిపారు. ఇక కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇందుకు హైకోర్టు నిరాకరించింది. సీసీటీవీ పర్యవేక్షణలో కేటీఆర్‌ను విచారించాలని కోర్టు ఆదేశించింది.

# రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం

■ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్, జనవరి 8:** రాష్ట్రంలో రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీ, అక్కడ నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. సరైన రహదారి సౌకర్యాలు లేక పోవడమే పల్లెల వెనకబాటుకి కారణమని ప్రభుత్వం పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాన్ని చేపడుతోందని అన్నారు. ఎర్రమంజిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో రూరల్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ కనక రత్నం, చీఫ్ ఇంజనీర్లు, సీఈలు, ఈఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్ల నిర్వహణ కోసం రూ.1600 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా రూరల్ ఇంజనీర్లు కార్యాచరణ సిద్ధం చేయాలని, కొత్త రహదారుల నిర్మాణ అంచనాలు పక్కాగా ఉండాలని సూచించారు. ఇష్టా రీతినా అంచనాలను సవరించొద్దని తెలిపారు. 30 మెట్రిక్ టన్నుల వాహనాలు నడిచేలా రోడ్ల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. ఇంజనీర్లే ఈ దేశ నిర్మాతలని అన్న మంత్రి మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కాకతీయుల కాలం నాడు కట్టిన కట్టడాలు ఇంకా పటిష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు. అదే రీతిన గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీర్లు కట్టే నిర్మాణాలు 10 తరాలు ఉండేవిధంగా చూడాలని పేర్కొన్నారు. మహానగరాల్లో రోడ్లు మెరిసినట్టుగానే పల్లెల్లో రహదారులు మెరవాలని, ఆ బాధ్యత గ్రామీణ విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులదేనని అన్నారు. పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణం జరగాలని అన్నారు. నాణ్యతపై రాజీ పడొద్దని, జిల్లా స్థాయిలో రూరల్ ఇంజనీర్లు ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. పనుల పురోగతి నివేదికలను ప్రతి 15 రోజులకు నివేదించాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గుండివాగు బ్రిడ్జి 10 ఏండ్లుగా పూర్తికాలేదని, దీనివల్ల 40 మంది ప్రజలు వాగు దాటలేక మృత్యువాత పడ్డారని మంత్రి అన్నారు. గతంలో తన నియోజకవర్గంలో సరైన గ్రామీణ రోడ్లు లేక ఎంతో మంది ఆత్మీయులను రోడ్డు ప్రమాదంలో కోల్పోయానని చెప్పారు. పట్టణాల్లో వర్లు, స్కై ఓవర్లు ఉన్నాయి, కానీ చాలా గ్రామాల్లో కనీస రోడ్డు సదుపాయం లేకపోవడం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల పల్లెలకు రహదారి సౌకర్యం కలిగిస్తేనే అసలైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఎస్టి వర్గానికి చెందిన తనకు పంచాయతీరాజ్ శాఖ అప్పగించారని అన్నారు. రూరల్ ఇంజనీర్లు సహకారం ఉంటే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. రోడ్డు సదుపాయం లేని ఆవాసాలు, గ్రామాలు ఉండొద్దని, ఆ లక్ష్యంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ భాగం పని చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# నీళ్లకోసం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

**నాగర్‌కర్నూల్, జనవరి 8 :** మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలోని ఏడో వార్డులో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో చాలా దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీళ్ల సమస్య తీర్చాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



# మే 1 నుంచి కొత్త జాబ్ నోటిఫికేషన్లు

మొదటి పేజీ తరువాయి

ఇంగ్లిష్‌లోనే అభ్యంతరాలను తెలపాలని, అభ్యర్థులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన ఆధారాల కాపీలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలని సూచించారు. ఈ-మెయిల్, వ్యక్తిగతంగా వెళ్లి సమర్పించడాన్ని ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టంచేశారు. ఇదిలావుంటే మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని కమిషన్ ప్రకటించింది. గురువారం గ్రూప్-3 'కీ' విడుదల చేయనుంది. రెండ్రోజుల్లో గ్రూప్-2 'కీ' విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు.

# ఫార్ములా ఈ కార్ రేసు కేసు ఏసీబీ దూకుడు

■ నిధుల విడుదలపై అరవింద్‌కు ప్రశ్నలు

**హైదరాబాద్, జనవరి 8:** ఫార్ములా ఈ కార్ రేసు కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసులో నోటీసులు అందుకున్న అప్పటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ బుధవాం ఉదయం ఏసీబీ విచారణకు వచ్చారు. దాదాపు మూడు గంటలుగా అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నించింది. ముగ్గురు ఏసీబీ అధికారుల బృందం.. ఫార్ములా ఈ కార్ రేసులో నిధుల మళ్లింపుకు సంబంధించే ఏసీబీ ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలుస్తోంది. రూ.55 కోట్ల నిధులను విదేశీ కంపెనీకి హెచ్ఎండీఏ చెల్లించిన నేపథ్యంలో ఇదే విషయంపై ఏసీబీ అధికారులు ప్రశ్నించారని సమాచారం. రూ.55 కోట్లు ఎఫ్ఈవో సంస్థకు చెల్లించిన నేపథ్యంలో విదేశీ కంపెనీకి నగదు బదిలీ వెనుక ఉన్న అసలు కోణం ఏంటి.. ఇది ఎవరి నిర్ణయం... నగదు బదిలీకి ఆర్బీఐ అనుమతి ఉందా అంటూ అరవింద్ కుమార్‌కు ఏసీబీ వరుస ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ ప్రశ్నలకు అరవింద్ కుమార్ కూడా కీలక సమాచారం చెప్పినట్లు సమాచారం. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అరవింద్ కుమార్ చెబుతున్న స్టేట్‌మెంట్‌ను ఏసీబీ రికార్డు చేస్తోంది. 55కోట్లు నిధుల విదేశీ అకౌంట్లుకు జమ చేయడం ఎవరి నిర్ణయం..ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎందుకు నిధులు రిలీజ్ చేశారు..కేబినెట్ అప్రూవల్ లేకుండా నిధులు రిలీజ్ చేయవద్దని మీకు తెలియదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. మంత్రిగా కేటీఆర్ ఆదేశాలు ఇచ్చినా .. ఆ రూల్స్‌ను ప్రజాప్రతినిధులకు చెప్పాల్సిన బాధ్యత ఉంది కదా ?రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతి లేకుండా .. బ్యాంక్ ఎలా నగదు బదిలీ చేసింది ?హెచ్ఎండీఏ పరిధిని మించి నగదు బదిలీ చేసింది.. మౌఖిక ఆదేశాలు కేవలం కేటీఆర్ మాత్రమే ఇచ్చారా లేక ఇంకా ఎవరైనా ఉన్నారా ?ఎఫ్ఈవోతో చేసుకున్న అగ్రిమెంట్ ఏంటి? అగ్రిమెంట్‌లోరాసుకున్న నిబంధనలు ఏంటి?గ్రీన్ కో స్పాన్సర్ షిప్ నుంచి వైదొలగడానికి కారణం ఏంటి ?ఒప్పందం ప్రకారం 2024 లో నిర్వహించాల్సిన రేస్ ఎందుకు నిర్వహించలేక పోయారు...?హెచ్ఎండీఏ కార్ రేసింగ్ కోసం కాకుండా .. ఇంకా వేటికైనా నిధులు రిలీజ్ చేశారా ?హెచ్ఎండీఏ నిర్ణయాల్లో ఛైర్మన్ పాత్ర ఏమైనా ఉంటుందా అంటూ ఇలా వరుసగా ఏసీబీ ప్రశ్నలు సంధించింది .ఓవైపు ఏసీబీ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తుండగా.. మరోవైపు ఈడీ కార్యాలయంలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు విచారించారు. ప్రధానంగా ఈ కార్ రేసులో హెచ్ఎమ్‌డీఏ పాత్ర స్వల్పంగా ఉన్నప్పటికీ స్పాన్సర్స్ చెల్లించాల్సిన డబ్బును హెచ్ఎండీఏ ఎందుకు చెల్లించాల్సి వచ్చిందని బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
గురువారం
9 జనవరి 2025


# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



**హైదరాబాద్, జనవరి 8:** మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ)ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ప్రజా భవన్లో మంత్రులు సీతక్క, కొండ సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్ తో కలిసి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామని, పెద్ద మొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు.

### అందుబాటులో ఉన్న భూమిని గుర్తించాలి..

మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లు లో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుంది.. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని వివరించారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని.. కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు.

### సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలి

అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో ఆ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బతికే అవకాశం స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుందని, చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని వెల్లడించారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నిటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన శాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టల తో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయి వీటి పైన సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. వీటి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రధానమంత్రి పీఎం కుసుం పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ రెడ్కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని, దీని ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి రావడం మే కాకుండా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

### గిరిజనులకు ప్రయోజనం

అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు. ఈ పథకం పై జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఈ పథకాని కోసం జిల్లాలో 40 ఎకరాలు సేకరించామని తెలిపారు. ఇంకా కావాలసిన భూమిలు నిర్ణిత గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి డీఆర్డీఓ శేషాద్రి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, సెస్ ఎండీ విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏకకాలంలో తెలుగు రాష్ట్రాల్లో ఐటీ దాడులు




**హైదరాబాద్, జనవరి 8 :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఐటీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆంధ్ర, తెలంగాణలో సుమారు 12 ప్రాంతాల్లో ఐటీ సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌లో నాలుగు చోట్ల తనిఖీలు జరుగుతుండగా.. ఆంధ్రాలో ఎనిమిది చోట్ల సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లతో పాటు మైన్స్ యజమానులకు చెందిన ఇళ్లల్లోనూ, కార్యాలయాల్లోనూ సోదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రియల్ లైఫ్ బంటి, బబ్లీ కేసులో ఐటీ సోదాలు నిర్వహిస్తోంది. భువనేశ్వర్‌లో అరెస్ట్ అయిన హన్సిత , అనిల్ కుమార్ మహంతి కేసులో సోదాలు కొనసాగుతున్నాయి. ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ పీకే మిశ్రకు అల్లుడు, కూతురు అని చెప్పుకుంటూ హన్సిత, అనిల్ వసూళ్లకు పాల్పడ్డారు. మొత్తం 12 ప్రాంతాల నుంచి రూ.100 కోట్లకుపైగా వీరుఇద్దరు వసూళ్లకు పాల్పడ్డారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తిరుగుతూ ప్రిన్సిపల్ సెక్రెటరీ పేరుని వాడుకున్న హన్సిత, అనిల్.. ప్రభుత్వంలో పనులు చేయిస్తామంటూ పలు కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేశారు. రెండు రోజుల క్రితం భువనేశ్వర్‌లో హన్సిత, అనిల్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా వీరి నుంచి కీలక సమాచారాన్ని పోలీసులు రాబట్టారు. హన్సిత, అనిల్ ఇచ్చిన సమాచారంతో 12 ప్రాంతాల్లో ఐటీ సోదాలు చేపడుతోంది. హైదరాబాద్, ఆంధ్ర, భువనేశ్వర్, ఢిల్లీ, ఝార్ఖండ్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు జరుగుతున్నాయి. వసూళ్లు చేసిన డబ్బులతో హన్సిత, అనిల్ లగ్జరీ లైఫ్‌ను ఎంజాయ్ చేసినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. లగ్జరీ కార్లు , అధునాతన విల్లాలతో పాటు లైఫ్‌ను ఎంజాయ్ చేశారు హన్సిత, అనిల్. ఇన్కమ్ టాక్స్ లేకుండా చేస్తానంటూ కంపెనీల నుంచి వసూల్లో పాల్పడ్డారు వీరిద్దరు. టాక్స్ ఎగ్గొట్టేందుకు హన్సిత, అనిల్‌లకు కంపెనీలు పెద్ద మొత్తంలో లంచాలు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగానే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలువురు ఈ ఇద్దరికి ముడుపులు ముట్టజెప్పినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆంధ్ర, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. ఎవరెవరైతే ఈ జంటకు లంచాలో అప్పజెప్పారో వారి ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కాగా.. ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కూతురు, అల్లుడినంటూ హన్సిత, అనిల్‌ను భారీగా డబ్బుల వసూళ్లకు పాల్పడ్డారు. ముఖ్యంగా మైనింగ్, నిర్మాణ రంగాల్లో ఉన్న ధనవంతులను టా÷–గ్గ÷ట్ చేస్తూ ప్రభుత్వ టెండర్లు ఇప్పిస్తామని నమ్మించేవారు. అందుకు సంబంధించిన ఫోటోలు, ఫేక్ సంబంధాలను చూపించి బాధితుల నుంచి భారీగా డబ్బులు వసూళ్లు చేశారు. ఈ క్రమంలో మోసానికి గురైన ఓ గనుల వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదుతో రీయల్ బంటి, బబ్లీ కేసు వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన భువనేశ్వర పోలీసులు దర్యాప్తు చేపట్టగా... ఈ దంపతులకు సంబంధించి అనేక విషయాలు బయటపడ్డాయి. చాలా మంది వద్ద నుంచి కోట్ల రూపాయలు మోసం చేసినట్లు ఆధారాలు లభించాయి. వీరి భారిన పడి మోసపోయిన వారు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్న పోలీసులు కోరారు.

# కేసులు సమస్యే కాదు

**ఫార్ములా కేసులో పైసా అవినీతి లేదు**

**న్యాయం కోసం సుప్రీంలో నేను కొట్లాడుతా**

**రైతు, ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు కొట్లాడాలి**

**బిఆర్ఎస్ డైరీ ఆవిష్కరణలో కెటిఆర్ పిలుపు**



హైదరాబాద్, జనవరి 8 : కేసులు అసలు సమస్యే కాదు. రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలి. ఈ కేసుపై నేను పోరాడతాను. భారాస నేతలు కేసు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను తప్పు చేయలేదు.. ఎవరికీ భయపడను' అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో భారాస డైరీని ఆ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరయ్యారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. ఫార్ములా ఈరేసు కేసు గురించి నేను చూసుకుంటాను. ఏసీబీ కేసు పెద్ద విషయం కాదు. నా కేసుల గురించి ఆందోళన, ఇబ్బంది లేదు' అని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు.

# కేటీఆర్‌పై ఏసీబీకి మరో ఫిర్యాదు

**హైదరాబాద్:** బీఆర్ఎస్‌వర్కింగ్‌ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీకి మరో ఫిర్యాదు అందింది. ఓఆర్ఆర్ టెండర్లలో అవకతవకలు జరిగాయంటూ బీసీ రాజకీయ ఐకాస అధ్యక్షుడు యుగంధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ఫార్ములా ఈ–రేసు వ్యవహారంలో కేటీఆర్ నిందితుడిగా ఉన్నారు. ఆయన్ను ఏసీబీ గురువారం విచారించనున్న విషయం తెలిసిందే

# శెభాష్ రాజన్న సిరిసిల్ల పోలీస్

**బాలిక కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు**

**ఫలించిన ఎస్పీ అఖిల్ మహాజన్ వ్యూహం**



**ప్రజానావ, సిరిసిల్ల/వేములవాడ:** వేములవాడ ఆలయ పరిసరాల్లో కిడ్నాప్‌నకు గురైన బాలిక ఆచూకీని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు కనిపెట్టారు. ఈ కిడ్నాప్‌ను సవాల్‌గా తీసుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్ డీఎస్పీ సహా ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 22 మంది పోలీస్ సిబ్బందితో ఐదు బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు దాదాపు 42వేలకు పైగా ఫోన్ కాల్స్ డేటాను సేకరించడం విశేషం. చివరికి మహబూబాబాద్ జిల్లాలోని ఓ ప్రాంతంలో పాపను గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. బాలిక ఆచూకీ కోసం దాదాపు 10 రోజులకు పైగా శ్రమించిన పోలీసులను జిల్లా ప్రజలు సూపర్ హీరోస్‌గా అభివర్ణిస్తుండడం విశేషం. ముఖ్యంగా ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని పక్కా ప్రణాళికలతో ఛేదించిన ఎస్పీపై జిల్లా ప్రజలంతా ప్రశంసలు కురిపిస్తున్నారు..



# పాలనపై ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై కేసులు

**రేవంత్‌కు తగిన గుణపాఠం చెప్తాం : హరీశ్‌రావు**

**హైదరాబాద్, జనవరి 8:** కాంగ్రెస్ పాలనపై నిత్యం నిలదీసినందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డికి ఎలా గుణపాఠం చెప్పాలో మాకు తెలుసునని ఆయన అన్నారు. కేటీఆర్‌కు ఆపద వస్తే పార్టీ మొత్తం అండగా నిలబడుతది అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ డైరీ ఆవిష్కరణ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రాఫ్ దిగజారిపోతున్నది.. కాబట్టి ఇలాంటి కేసులు పెట్టి ప్రజలను డైవర్షన్ చేస్తున్నడు. కుట్రలో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టిండు. ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఆపదొస్తే బీఆర్ఎస్ ఎట్లా నిలబడ్డదో, పార్టీ మొత్తం కేటీఆర్ వెంట ఉంటది. లగచర్ల గిరిజన రైతుల కోసం కేటీఆర్ ఎంతో కష్టపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటుగా అండగా నిలబడి, న్యాయం చేశాడు అని హరీశ్‌రావు తెలిపారు. ఈ ఏడాది కాలంలో ఏం చేసినవు నాయనా నువ్వు, పబ్లిక్ అటెన్షన్ డైవర్షన్ తప్ప అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. కేటీఆర్ మీద అక్రమ కేసు పెట్టి, అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేసి, పబ్లిక్ అటెన్షన్ డైవర్షన్ చేస్తున్నవ్. లగచర్ల రైతులను అరెస్టు చేసి, 15 రోజులు డైవర్షన్ చేసినవు. అల్లు అర్జున్ పేరు మీద డైవర్షన్ టాక్టిక్స్ చేసినవు. దానికంటే ముందు తెలంగాణ తల్లి విగ్రహం మార్చి అదో 15 రోజులు డైవర్షన్. టీఎస్‌ను టీజీగా మారుస్తున్నా అని ఒక డైవర్షన్ టాక్టిక్స్. తెలంగాణ ఎంబ్లమ్ మారుస్తున్నా అని చెప్పి డైవర్షన్ టాక్టిక్స్. ఇవి తప్ప నువ్వు ప్రజలకు చేసిందేమైనా ఉన్నదా? నువ్విచ్చిన హామీలు అమలు చేసిందేమన్నా ఉన్నదా? కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాల పరిస్థితి ఏమైంది? అని హరీశ్‌రావు నిలదీశారు. కేసీఆర్ కిట్లు బంద్ అయిపోయినయి, న్యూట్రిషన్ కిట్లు బంద్ అయిపోయినయి. బతుకమ్మ చీరెలు బంద్ అయిపోయినయి, రైతుబంధు బందయిపోయింది, బీసీ బంధు బందయిపోయింది, దళిత బంధు బందయిపోయింది. ఉన్న పథకాలు బందు పెట్టుడు తప్ప నువ్వు కొత్తగా తెచ్చిందేమన్నా ఉన్నదా? రైతు భరోసా అన్నవు, అపుడేమో ఎకరానికి 15 వేలు ఇస్త అన్నవు. పార్లమెంటు ఎన్నికలకు ముందు ఒక్క పంటకు ఎకరాకు 5 వేలే ఇచ్చినవు. వానాకాలం ఎగ్గొట్టినవు. మళ్లీ ఇపుడు స్థానిక సంస్థల ఎన్నికలున్నయి గనుక మల్లొక్కసారి రైతుబంధు వేస్తాడు, తర్వాత ఎగ్గొడుతడు ఈ ఎగవేతల రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు.

# అల్లు అర్జున్ విడుదలలో ఎలాంటి తప్పిదం లేదు

**జైళ్ల వార్షిక నివేదిక విడుదలలో డిజి సౌమ్యా మిశ్రా**



**హైదరాబాద్, జనవరి 8 :** ఇటీవల పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన ఎంత దుమారం రేపిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఘటనలో హీరో అల్లు అర్జున్ అరెస్టయిన సంగతి కూడా తెలిసిందే. అయితే.. నాటకీయ పరిణామాల మధ్య అల్లు అర్జున్ అరెస్ట్ అవ్వడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ విడుదల సమయంలో వెనుక గేట్ నుండి పంపడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై క్లారిటీ ఇచ్చారు జైల్ డీజీ సౌమ్య మిశ్రా. అల్లు అర్జున్ ను జైలు వెనుక గేటు నుండి పంపడంలో తమ నుండి ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు సౌమ్య మిశ్రా. జైళ్ల వార్షిక నివేదిక విడుదల సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మేరకు సౌమ్య వ్యాఖ్యలు చేశారు. చివరిసారిగా 2019 లో వార్షిక సమావేశం ఏర్పాటు చేశామని.. 2024 లో జైల్ అదాలత్ లో 1045 లో అవకాశం కల్పించామని అన్నారు సౌమ్య. 2650 మంది ఖైదీలు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ట్రైనింగ్ తీసుకుంటున్నారని.. సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలను విడుదల చేసినట్లు తెలిపారు. 2024 లో 8 మంది ఖైదీలకు బ్యాంక్ లోన్స్ ఇచ్చామని.. జైల్లో ఉండి 750 మంది డిగ్రీ పూర్తి చేశారని, 225 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్ట పొందారని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీల ద్వారా ఇంటికి అవసరమైన పరికరాలను ఖైదీలతో తయారు చేయించామని.. ఖైదీల నుండి టైలరింగ్, ప్రింటింగ్ ప్రెస్ బేకరి యూనిటి, పౌల్ట్రీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశామని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఉపాధి కల్పనకు అవసరమైన జాతీయ చమురు కంపెనీలతో 29 అవుట్ లే అవుట్ లెట్ల ను ఏర్పాటు చేశామని అన్నారు సౌమ్య. నుమయిష్ ఎగ్జిబిషన్ లో మా స్టాల్ ఏర్పాటు చేశామని.. గతంలో నుమయిష్ ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన స్టాల్ కి తెలంగాణ ప్రభుత్వం అవార్డు ఇచ్చిందని తెలిపారు సౌమ్య. జైళ్లను ఎ÷–లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని. త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జైళ్లను మరమ్మత్తులు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని సౌమ్య తెలిపారు.



# ఢిల్లీ ఎయిర్‌పోర్టు వారంపాటు మూత


**న్యూఢిల్లీ:** ఢిల్లీ ఎయిర్ పోర్టు వారం రోజుల పాటు మూత పడనుంది. ప్రతిరోజు గంటన్న రకు పైగా ఎయిర్ పోర్టు రన్‌వే మూతపడ నుండటంతో ప్రయాణికులకు ఎయిర్ పోర్టు అథారిటీ కీలక సూచనలు చేసింది. జనవరి 19 నుంచి 26 వరకు ఢిల్లీ ఎయిర్ పోర్టు ర న్ వే రోజూ 145 నిమిషాలు మూతపడనుం దని అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈ వారం రోజులు ఉదయం 10.20 నుం చి మధ్యాహ్నం 12.45 వరకు రిపబ్లిక్ సెల బ్రేషన్స్‌లో భాగంగా మూసివేయ నున్నారు. ప్రతిరోజూ ఈ సమయంలో డ్రిల్స్, డ్రెస్ రి హార్సల్స్, రిపబ్లిక్ డే పరేడ్ తదితర కార్యక్ర మాలు ఉండనున్నాయి. రిపబ్లిక్ డే వేడుకల కోసం భద్రతా కారణాల దృష్ట్యా నోటామ్ ఢిల్లీ విమానాశ్రయం రన్‌వే జనవరి 19 నుంచి జనవరి 26 వరకు ప్రతిరోజూ 145 నిమిషా ల పాటు మూసివేయబడు తుంది. ఉదయం 10:20 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు రిహార్సల్స్, రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ వారం రోజులపాటు మధ్యాహ్నం వరకు ఢిల్లీ ఎయిర్ పోర్ట్ రన్‌వే మూసివేస్తే 1,300 కంటే ఎక్కువ విమానాలకు అంతరాయం కలుగుతుం దని అధికారులు చెబుతు న్నారు. ఈ నేపథ్యంలో విమానయా న పరిశోధన సంస్థ సిరియ మ్ ప్రకారం 1,336 విమా నాలపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. వా టిలో 665 బయలుదేరేవి కాగా, 671 రాకపోకలు సా గించేవన్నారు. దీంతోపాటు టొరంటో, వాషింగ్టన్, తా ష్కెంట్, కొలంబో వంటి గ మ్యస్థానాలకు వెళ్లే అంతర్జా తీయ విమానాలు కూడా ప్ర భావితమయ్యాయి. ఈ క్ర మంలో కొన్ని విమానా లు పూర్తిగా రద్దు కాకుండా రీషెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంటుంది. ఇటీవల ఢిల్లీలో పొగమం చు గరిష్ట స్థాయికి చేరు కున్న కారణంగా వందల సంఖ్యలో విమానాలు ఆలస్యం అయిన సంఘట న వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రయాణీకు లు విమాన మార్పుల గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు.



# రేషన్ బియ్యం అక్రమాలపై చర్యలేవీ

పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రూపాయికే కిలోబియ్యం పథకం పందికొక్కుల పాలవుతోంది. ఇదంతా పెద్ద మాఫియాగా మారింది. బియ్యం మొత్తం విదేవాలకు తరలుతున్నాయి. కొందరు అధికారులు, రాజకీయ నేతలు కలసి దీనిని బడా వ్యాపారంగా మార్చేశారు. రూపాయికే కిలో బియ్యం పథకంలో లోపాలు కళ్లకు కనిపిస్తున్నా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కావాలనే అచేతనంగా ఉండిపోయాయి. పథకం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోవడం లేదు. 42 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయలుగా ఉన్న బియ్యాన్ని తలకుమాసిన నేతలు అధికారంలోకి వచ్చి..కిలో రూపాయి చేశారు. ఇప్పటికే జనాభాలో 80శాతం మందికి ఈ బియ్యం ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయినా ఇంకా కొత్తగా రేషన్ కార్డుల డిమాండ్ పుట్టుకొస్తోంది. పాతవాటిలో అక్రమాలను అరికట్టి, బియ్యం ధరలు పెంచి పక్కాగా పథకాన్ని అమలు చేయాల్సిన ఇరు రాష్ట్రాల సిఎంలు ఇంకా ప్రజలను మభ్య పెడుతున్నారు. వేలకోట్లు దుర్వినియోగం అవుతున్న ప్రజాధనానికి ఎవరు బాధ్యులు అన్నది చెప్పడం లేదు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నుల డబ్బులను ఇష్టారీతిన వృధా చేయడమేనా పాలకుల పని అని ప్రజలు నిలదీయాల్సి ఉంది. ఇకపోతే ఎపిలో పేదల బియ్యం పూర్తిగా పక్కదారి పట్టాయి. రాష్ట్రంలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా విదేశాలకు తరలించిన తీరు బయటపడ్డా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ప్రతిపక్ష వైసిపి కారణమని టిడిపి కూటమి ఆరోపిస్తుంటే, మీరే కారణమని వైసిపి నేతలు టిడిపి, జనసేన నేతలను విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారు. లక్షల టన్నుల బియ్యాన్ని కొన్నేళ్ళుగా యథేచ్ఛగా తరలిస్తూ వచ్చారు. అసలు దోషులు బయట పడకుండా పేదల బియ్యాన్ని పెద్దలు గద్దల్లా ఎగరేసుకు పోయారు. తెలంగాణలో సైతం ఇలాంటి దోపిడీ జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఓట్లమీద ఉన్న శ్రద్ధ అక్రమాలను అరికట్టడంలో కనిపించడం లేదు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందుతున్న బియ్యం అసలు పేదలకు అందడం లేదన్నది అక్షర సత్యం. ఈ బియ్యం ఆటో, లారీల స్థాయి దాటి ఓడల వరకు చేరిందని రుజువయ్యింది. బియ్యం పథకం పంపిణీ కార్యక్రమం కేంద్రానిదని, ప్రతి స్టోర్ దగ్గర మోడీ ఫోటో పెట్టాలని తెలంగాణ, ఆంధ్రలో పెద్ద యాగీ చేసిన కేంద్ర మంత్రులు, బిజెపి పెద్దలు అక్రమ బియ్యం తరలింపు విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ఎందుకు దీనిపై చర్యలకు ఉపక్రమించడం లేదు. అన్ని రకాల సబ్సిడీ పథకాలను రద్దు చేసి సమీక్షించాలి. నిజమైన పేదలను గుర్తించాలి. దుబారా పథకాలకు కాలం చెల్లిందన్న విధంగా కళ్లెం వేయాలి. నగదు బదిలీ పథకాల అమలుపై సమీక్షించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఓట్లు ముడిపడి వున్నందున దీనిని సమీక్షించడం సాధ్యం కావడంలేదు. పేదలు రేషన్ బియ్యం ఎందుకు అమ్ముకుంటారన్న చర్చ చేయాలి. బహిరంగ మార్కెట్‌లో కనీసం 40లుగా ఉన్న బియ్యం ఇప్పుడు రూపాయికే దక్కితే అవి పెద్ద వ్యాపార వస్తువుగా మారింది. ఓడలకు ఎక్కించగలిగినంత బియ్యం అమ్మగలగడం ఇందుకు నిదర్శనం. ఎపిలో గత ఐదేళ్ళలో 1.31 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. కాకినాడ ఓడరేవులో సిద్ధంగా వున్న ఓడను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనిఖీ చేసి సీజ్ చేయమని ఆదేశించారు. విశాఖపట్నం ఓడరేవులో రాష్ట్ర సివిల్ సప్లరు శాఖ మంత్రి ఇలాగే ఓ ఓడను తనిఖీ చేసి అందులో వున్న బియ్యం పేదల బియ్యమేనని ప్రకటించారు. ఇక తెలంగాణలో ఎంత దోచకున్నారో కిక్కురుమనడం లేదు. ఒకవైపు తిండి లేక పేదలు అల్లాడుతుంటే ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న బియ్యం దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిందే. అధికార పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంవల్ల, అందులో ఎక్కువ మంది బియ్యం అమ్ముకునే వారు వుండే అవకాశం ఉంది. కానీ అత్యధిక పేదలు రేషన్ బియ్యంతోనే నెలలో కొద్ది రోజులైనా కడుపు నింపుకుంటున్నారు. ఇలా అక్రమాలను పక్కన పెట్టి సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత...బియ్యాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నారు. రేషన్ కార్డులకు ఇస్తున్న బియ్యానికి కిలో రూ.43.50 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇంత ఖర్చు చేసినా పేదలకు మంచి బియ్యం ఎందుకు ఇవ్వలేకపోతున్నారన్నది కూడా ప్రశ్నే. ధాన్యం సేకరణ నుండే పాలకులు,ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో స్టోర్ల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యాన్ని నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలించి నాయకులు అప్పనంగా సంపాదించుకుంటున్నారు. గ్రామాల వారీగా కార్డులు ఉన్నవారి వివరాలు సేకరించి, అందులో పేదలు ఎంతమందన్నది గుర్తించాలి. నిజమైన పేదలకే బియ్యం అందాలి. బియ్యం ధరలను కూడా సవరించాలి. అప్పుడే ఈ పథకంలో అక్రమాలను నిరోధించగలం. ప్రజా పంపిణీలో అక్రమాలను అరికట్టాలి. దోషులు ఎంతటి వారైనాసరే కఠినంగా శిక్షించాలి. అదే సమయంలో నాణ్యమైన బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా అసలు సిసలు పేదలకు అందించాలి.సార్వత్రిక ప్రజా పంపిణీ అమలు కొరకు ఉద్యమించాలి. అయితే పేదలు ఎవరన్నది కూడా నిర్వచించాలి. ఇన్నేళ్లుగా వారు పేదలుగానే ఎందుకు మగ్గుతున్నారో అధ్యయనం చేయాలి. ఇన్నేళ్లుగా పథకాలు వారికి అందుతున్నా ఎందుకు పేదరికం నుంచి బయటపడడం లేదో కూడా అధ్యయనం చేయాలి. ప్రభుత్వాలు కేవలం ప్రేక్షకపాత్రను వదిలి పనిచేయాలి.

# గౌతం అదానీపై అమెరికాలో విచారణ



**న్యూఢిల్లీ, జనవరి 8:** బిలియనీర్ గౌతం అదానీ, ఆయన కంపెనీలపై విచారణ చేపట్టేందుకు ఇటీవల అమెరికా సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ముడుపులు చెల్లించిన కేసులో అమెరికా కోర్టు అదానీని నిలదీసింది. అయితే భారతీయ వ్యాపారిపై అమెరికా న్యాయశాఖ తీసుకున్న నిర్ణయాన్ని రిపబ్లికన్ నేత తప్పుపట్టారు. ఎంపిక చేసుకుని ఓ వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల.. భాగస్వామ్య దేశాలతో బంధాలు దెబ్బతింటాయని ఆ నేత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ బీ గార్లాండ్‌కు లేఖ రాశారు లాన్స్ గూడెన్. విదేశీ వ్యక్తులను ఎంచుకుని ఎందుకు టార్గెట్ చేస్తున్నారని న్యాయశాఖను డిమాండ్ చేశారాయన. అదానీ విచారణ వెనుక ఏదైనా లోగుట్టు ఉన్నాదా అని, దీని వెనుక జార్జ్ సోరస్ లాంటి వ్యక్తి ఉన్నారా అని రిపబ్లికన్ నేత ప్రశ్నించారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు బలమైన భాగస్వామిగా ఇండియా ఉన్నదని, టార్గెట్ చేసి చర్యలు తీసుకోవడం వల్ల భాగస్వామ్య కూటమి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. దేశంలోని చెడు వ్యక్తులను ముందుగా అమెరికా న్యాయశాఖ శిక్షించాలని, విదేశీ వ్యక్తులను కాదు అని గూడెన్ పేర్కొన్నారు. వందల కోట్ల డాలర్లు పెట్టుబడి పెటి, అమెరికన్ల కోసం లక్షలాది ఉ ద్యోగ అవకాశాలు కల్పిస్తున్నవారిని టార్గెట్ చేయడం వల్ల దీర్ఘకాలంలో అమెరికాకే నష్టం జరుగుతుందని గూడెన్ తన లేఖలో తెలిపారు. ఒకవేళ అదానీపై ఆరోపణలు నిజమైనా, వాటిని నిరూపించినా, ఆ అంశంలో అమెరికా పాత్ర ఏముంటుందని గూడెన్ ప్రశ్నించారు. అదానీ సంస్థ భారత్‌లో అక్కడి అధికారులకు లంచాలు ఇచ్చిందని, ఓ భారతీయ కంపెనీ ఆ లావాదేవీలకు పాల్పడిందని, దీంట్లో అమెరికా వ్యక్తుల ప్రమేయం ఏమి ఉందని గూడెన్ తన లేఖలో తెలిపారు. అమెరికా వ్యక్తుల ప్రమేయం లేనప్పుడు.. విదేశీ వ్యక్తులను విచారించేందుకు న్యాయశాఖ ఎందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుందని ఆయన అడిగారు. అదానీ ముడుపుల కేసులో ఏ ఒక్క అమెరికా వ్యక్తి లేకపోవడం ఏంటని న్యాయశాఖను ప్రశ్నించారు. ఇండియాలో అవినీతి జరిగితే, అదానీపై అమెరికాలో కేసు ఎందుకు రిజిస్టర్ చేసినట్లు న్యాయశాఖను నిలదీశారు. మీరేమైనా ఇండియాలో న్యాయం కోసం వత్తిడి తెస్తున్నారా అని అడిగారు. ఈ కేసులో నిమగ్నమైన భారతీయ అధికారులను అమెరికాకు రప్పిస్తారా అని ప్రశ్నించారు. ఒకవేళ అవినీతి అధికారుల్ని అప్పగించేందుకు భారత్ నిరాకరిస్తే, అప్పుడు అమెరికా న్యాయశాఖ వద్ద ఉన్న ఆప్షన్ ఏంటని అడిగారు. అమెరికా, భారత్ మధ్య చిచ్చు పెట్టి, బైడెన్ సర్కారు అదానీ కేసును అంతర్జాతీయం చేయాలని చూస్తున్నదా అని రిపబ్లికన్ నేత గూడెన్ ప్రశ్నించారు.

# భారత భూభాగం ఆక్రమణ

## బంగ్లా కథనాలను తిప్పికొట్టిన బిఎస్‌ఎఫ్



**న్యూఢిల్లీ, జనవరి 8 :** భారత్‌లో 5 కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ ఖండించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది. 'నార్త్ 24 పరగణాస్ జిల్లాలో రాంఘాట్ గ్రామంలోని బగ్దా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇర-ువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఇక ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు. ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు, తీసుకోలేరు కూడా. 1975 భారత్ బంగ్లా బోర్డర్ గైడ్‌లైన్స్ ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి' అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రంటియర్ పేర్కొంది. అంతేకాదు.. కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది. అంతేకాదు.. బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ (బీజీబీ) మోటార్ బోట్లు, ఏటీవీలతో డిసెంబర్ 19 నుంచి గస్తీ మొదలుపెట్టిందన్న ప్రచారాన్ని కూడా కొట్టిపారేసింది. మాల్దా జిల్లాలో సుక్‌దేబ్‌పుర్‌లో సరిహద్దుల వెంట బీఎస్ఎఫ్, బీజీబీ గార్డ్స్‌కు మధ్య ఫెన్సింగ్ విషయంలో గొడవ జరిగింది. భారత్ వైపు కంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ గ్రామాల్లో ప్రజలు చేరుకొని వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేశారు. ఆ తర్వాత బీఎస్ఎఫ్ దళాలు స్పందిస్తూ ముందస్తుగా ఇరుదేశాలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం దానిని నిర్మిస్తున్నట్లు బీజీబీకి నచ్చజెప్పారు. ఆ తర్వాత తిరిగి కంచె పనులు మొదలు పెట్టారు.





## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్‌లో గొడ్డుకారం

# బాధాకరం : కేటీఆర్

**హైదరాబాద్, జనవరి 8:** మహాత్మాగాంధీ యూనివర్సిటీలోని హాస్టల్‌లో విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్‌కు బదులు గొడ్డుకారం అన్నం పెట్టడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ స్కూల్ పిల్లలకు పౌష్టికాహారం కింద ఉప్పు, కారం, బియ్యం.. ఈ అమానవీయ పరిస్థితిపై స్పందించగల జాతీయ లేదా ప్రాంతీయ మీడియాకు ఈ శీర్షికను సూచిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. హాస్టల్ విద్యార్థినులకు గొడ్డు కారంతో భోజనం పెట్టడంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రియాంక గాంధీ 2019లో ఆమె చేసిన ప్రకటనను గుర్తు చేసుకుని తెలంగాణ విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలని సూచించారు. లేదా యూపీలో జరిగినప్పుడే దీన్ని జాతీయ సమస్యగా పరిగణిస్తారా? వేరే రాష్ట్రంలో జరిగిన అలాగే చూస్తారా అని నిలదీశారు. ఇది తెలంగాణ కాబట్టి ఉప్పు మాత్రమే కాకుండా.. ఉప్పుతో పాటు కారం కూడా ఉండటంతో వార్తకు స్పైసీనెస్ తగ్గిందా? లేదా సమస్య తీవ్రత తగ్గిందని భావిస్తున్నారా అని ప్రశ్నించారు.

# ఆధునిక జర్నలిజం

డిజిటల్ మీడియా నేటి సమాజంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతు మారుతున్న సమాజానికి అత్యంత ప్రభావవంతమైన స్తంభాలలో ఒకటిగా నిలుస్తుందని చేప్పడంలో ప్రతి జర్నలిస్టు గర్వపడాల్సిందే. అయితే ఇదే తరుణంలో జర్నలిస్టులలో బాధ్యతారాహిత్య ధోరణి పెరిగిపోవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. పాత్రికేయులు నైతికతను విడిచిపెట్టడం, సంచలనాత్మకత అలాగే సత్యఅన్వేషణ కంటే వ్యక్తిగత లాభార్జనకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఉన్నతమైన వృత్తి మసకబారుతుంది, కొన్ని సందర్భాల్లో తప్పుడు సమాచారంతో సామాజిక విభజనకు దారితీసే ప్రమాదం నెలకొంది.

ఆధునిక జర్నలిజం తరచుగా సంచలనాత్మక ముఖ్యాంశాలు, పక్షపాత రిపోర్టింగ్, ధృవీకరించని దావాల వైపు మొగ్గు చూపుతుంది. చాలా మంది జర్నలిస్టులు ఇప్పుడు వాస్తవమైన, నిష్పాక్షికమైన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడం కంటే క్లిక్‌లను పొందడం అలాగే రేటింగ్‌లను పెంచడంపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు. ఇలా బాధ్యతరాహిత్యంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా మీడియా సంస్థలపై వున్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. జర్నలిస్టులు వాస్తవాలను తనిఖీ చేయడంలో లేదా సమతుల్య దృక్పథాలను అందించడంలో విఫలమైనప్పుడు, వారు సమాజం యొక్క ధ్రువణానికి దోహదం చేస్తారు, పౌరులను గందరగోళానికి గురిచేసి వదిలివేస్తున్నారు. అంతేకాకుండా, జర్నలిస్టులు తరచుగా సెలబ్రిటీల గాసిప్‌లు లాంటి పనికిమాలిన వివాదాలను వెంబడిస్తున్నారు, సామాజిక మార్పు, పేదరికం, వ్యవస్థాగత అవినీతి వంటి నిజమైన సామాజిక ప్రాముఖ్యత గల కథనాలను పక్కన పెడుతున్నారు. ఈధోరణి వల్ల ప్రజల ఒత్తిడితో కూడిన సమస్యల నుండి దృష్టిని మళ్లిస్తుంది అలాగే పత్రికా ప్రజాస్వామ్య పనితీరును ప్రశ్నిస్తుంది.

జర్నలిజంపై విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి దానిని మంచి కోసం ఒక శక్తిగా మార్చడానికి, జర్నలిస్టులు తమ ప్రధాన విధులతో తమకు తాము మార్చుకోవాల్సి అవసరం వుంది. జవాబుదారీతనంతో కూడిన పరిశోధనాత్మక జర్నలిజం వాస్తవిక ఖచ్చితత్వంతో పాతుకుపోయినప్పుడే అవినీతి, అన్యాయాలపై వెలుగునిస్తుంది, సానుకూల మార్పుకు దారి తీస్తుంది. సామాజిక సమస్యలను పరిష్కరించే కథనాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, జర్నలిస్టులు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా పౌరులను శక్తివంతం చేయగలరు.

బాధ్యతాయుతమైన రిపోర్టింగ్‌ను నిర్ధారించడానికి మీడియా సంస్థలు కూడా తప్పనిసరిగా నైతిక ప్రమాణాలను కూడా నొక్కి చెప్పాలి. వార్తల్లో పారదర్శకత పాఠకుల్లో విశ్వాసాన్ని పునర్నిర్మించడతాయి. జర్నలిస్టులు నైతికతను కలిగిన కథనాలను రూపొందించినప్పుడే అవి సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే శక్తిని కలిగివుంటాయి అయితే నైతిక పద్ధతులకు కట్టుబడిన జర్నలిజమే సమాజ పురోగతికి బలమైన మూలస్తంభంగా నిలుస్తుందని. ప్రజాస్వామ్యం అలాగే సామాజికన్యాయం నిలబెట్టడంలో పాత్రికేయుల కీలక పాత్రను విధినిర్వహణలో ప్రతి జర్నలిస్టు గుర్తుంచుకోవాలి.



సఫీఉల్లా పర్వాజ్

# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

గురువారం
9 జనవరి 2025






# ఆధ్యాత్మిక శోభతో మహా శివరాత్రి

- ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు జాతర నిర్వహణ
- భక్తుల నుంచి ఒక్క ఫిర్యాదు రాకుండా ఏర్పాట్లు చేయాలి
- పారిశుధ్య నిర్వహణ ను అత్యంత ప్రాధాన్యతగా భావించాలి
- భద్రత అంశంలో పోలీస్ శాఖ అత్యంత అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మహా శివరాత్రి జాతర ఏర్పాట్ల పై కలెక్టర్, ఎస్పీ తో రివ్యూ

**ప్రజానావ, వేములవాడ:** మహాశివరాత్రి జాతర ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఓపెన్ స్లాబ్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు 3 రోజుల పాటు మహా శివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా వేములవాడలో నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన శాఖల వారీగా రివ్యూ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ అధికారులకు సూచించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా అదనపు బస్సులు, పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, త్రాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్ ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, కళ్యాణ కట్ట, ధర్మ గుండం, బద్ది పోచమ్మ ఆలయం, హెల్ప్ సెంటర్ , సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే జాతర ఆధ్యాత్మికంగా, దైవికంగా నిబంధనలు పాటిస్తూ, ఎక్కడా ఎలాంటి లోపాలు జరగకుండా నిర్వహించాలని ప్రభుత్వ విప్ సూచించారు. ఫిబ్రవరి 26 న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడలో ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు 3 రోజుల పాటు మాహా జాతర ను వైభవోపేతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గత మహా శివరాత్రి ఉత్సవాలకు 2 లక్షల 50 వేల మంది భక్తులు వచ్చారని, ప్రస్తుత సంవత్సరం 4 లక్షల కంటే ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆ స్థాయిలో మనం జాతర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి..

జాతరకు వచ్చే భక్తులకు నీడ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. జాతర సందర్భంగా పక్కన మున్సిపాలిటీలు, గ్రామాల నుంచి కార్మికులను డిప్యూట్ చేసుకొని జోన్ల వారీగా విభజించే పారిశుధ్య పక్కగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మజ్జిగ ప్యాకెట్లు, పాలు అందించేలా దేవస్థాన సంస్థ ఏర్పాట్లు చేయాలని అన్నారు. క్యూ లైన్లలో చేరిన భక్తులకు దర్శనం కోసం అధిక సమయం పట్టే నేపథ్యంలో వారికి పాలు అందించేలా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ సూచించారు. క్యూలైన్లలో వచ్చే భక్తులకు ప్రధాన ఆలయం ఎంటర్ కాకముందే అవసరమైన మేర టాయిలెట్స్ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. టాయిలెట్స్ దగ్గర ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది కేటాయించి ప్రతి 15 నిమిషాలకు శుభ్రం చేసే విధంగా చూడాలని అన్నారు. శివరాత్రి జాతరకు ఏ ఒక్క భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగడానికి వీలు లేదని, ఈ బాధ్యతను తీసుకోవాలన్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు వేములవాడ కు గతం కంటే 30శాతం అధికంగా బస్సు సర్వీసులు నడపాలని, భక్తుల రద్దీ ఆధారంగా డిపో మేనేజర్లు ఎప్పటి కప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన రోడ్లలో అదనపు సర్వీసులు నడపాలని ప్రభుత్వ విప్ సూచించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అదనపు కళ్యాణ కట్టలు ఏర్పాటు చేయాలని, బద్ది పోచమ్మ ఆలయం , నాంపెల్లి ఆలయం వద్ద అదనపు క్యూ లైన్లు సిద్ధం చేయాలని, అవసరమైన భద్రత కల్పించాలని, విద్యుత్ అలంకరణ పనులు ఆకర్షణీయంగా చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రధాన ఆలయం, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండ్ ,జగిత్యాల రోడ్డు, పార్కింగ్ దగ్గర అవసరమైన హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మహా జాతర జరిగే సందర్భంగా మద్యం అమ్మకాలను వేములవాడ పరిసరాలలో నిషేధించాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రసాదం కౌంటర్లు మరిన్ని చోట్ల పెట్టాలని సూచించారు. గతం కంటే అధికంగా పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని, అక్కడ పోలీసుల కోసం టెంట్, తాగునీటి సరఫరా ఉండాలన్నారు.

## ఫిబ్రవరి 25న ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు..

వేములవాడ ఆలయం ప్రధాన అర్చకులు భీమ శంకర శర్మ మహాశివరాత్రి జాతర సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఫిబ్రవరి 25, 2025 న రాత్రి ఏడు గంటలకు ప్రభుత్వం, రాత్రి 7 గంటల 30 నిమిషాలకు పట్టు వస్త్రాల సమర్పణ, తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 26న తెల్లవారుజామున 12 గంటల నుంచి 2.30 గంటల వరకు పుర జనులకు సర్వదర్శనం ఉంటుంది. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి ఉదయం 3.30 గంటల వరకు ప్రజా ప్రతినిధులు స్థానిక అధికారులకు దర్శనం, ఉదయం 3.30 నుంచి 3.40 గంటల వరకు మంగళ వాయిద్యంలో ప్రదర్శన, ఉదయం 3.40 నుంచి 4.30 గంటల వరకు సుప్రభాతం సేవ, ఆలయ శుద్ధి, ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు ప్రాతకాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు శివదీక్ష స్వాముల దర్శనం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మహా లింగార్చన (స్వామివారి కళ్యాణ మండపంలో) అనువంశిక బ్రాహ్మణోత్తముల దర్శనం , రాత్రి 11.35 నిమిషాలకు లింగోద్భావ కాలం నందు శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వాక ఏకాదశ రుద్రాభిషేకము నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, అదనపు ఎస్పీ శేషాద్రి రెడ్డి, ఈఓ వినోద్ రెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు,సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రజా ప్రతినిధులు సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోజు ఎన్ని లడ్డూలు చేస్తారు?



**ప్రజానావ, వేములవాడ:** శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం తనిఖీ చేశారు. మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశం అనంతరం విప్, కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ ఈవో వినోద్ రెడ్డి శాలువాలతో సన్మానించి, స్వామి వారి ప్రసాదాన్ని అందజేయగా, అర్చకులు ఆశీర్వచనం చేశారు. అనంతరం విప్, కలెక్టర్ తదితరులు లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. స్టోర్ రూం, లడ్డూ తయారీకి వినియోగించే పదార్థాలు, నెయ్యి, తయారీ విధానం, పరిసరాలు తనిఖీ చేశారు. రోజు ఎంత నెయ్యి వినియోగిస్తున్నారు, ఎన్ని లడ్డూలు రోజు సిద్ధం చేస్తారు? ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారో ఆరా తీశారు. లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని పూర్తిగా ఆధునీకరించాలని, భక్తుల సంఖ్యకు అనుగుణంగా ప్రసాదం అందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నాణ్యత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.

# అనారోగ్య బాధితులకు విప్, కలెక్టర్ అండ

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి అండగా నిలిచిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సహాయం అందించి భరోసా అందించారు. జిల్లాలోని తంగళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన కంసాని మహేశ్ కుమార్తె సమంత కొద్దిరోజులుగా బోన్ క్యాన్సర్ తో బాధ పడుతున్నారు. దవాఖానాలో చికిత్స అందించేందుకు చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి కి చెందిన గోపగాని వీరస్వామి గౌడ్ భార్య లివర్ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నారు. తమ వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని ఆయా కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వారు బుధవారం విన్నవించారు. వారి సమస్యలపై వెంటనే చలించి తక్షణ ఆర్థిక సహాయం కింద కంసాని మహేశ్ కుమార్తె సమంతకు రూ. లక్ష, గోపగాని వీరస్వామి గౌడ్ కు రూ. 50 వేల చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు. తమకు సహాయం అందించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు బాధిత కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





# గురుకులాల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష


**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** 2025-26 విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆయా గురుకులాలు స్వీకరిస్తున్నాయని, వీటికి ఫిబ్రవరి 1 చివరి తేదీ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీల భర్తీకి, టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ గౌలి దొడ్డి, అల్గునూర్ సీఓఈలలో 9వ తరగతిలో ప్రవేశాలు, టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈలలో 8వ తరగతి లో ప్రవేశాలు, టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్ లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రకటన జారీ చేశారు. దరఖాస్తుని https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్ లో మాత్రమే సమర్పించాలని సూచించారు. పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ, ఫొటోల దరఖాస్తుకు జతపరచాలన్నారు. ఏవైనా ఇబ్బందులుంటే అభ్యర్థుల సహాయార్థం కలెక్టరేట్ లో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థుల సహాయార్థం సర్టిఫికెట్స్ సత్వరం జారీ చేసేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 05 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.

# నెరవేరిన రైతుల కల

**మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటి విడుదల**

**ఆయకట్టు పొలాలలో బోర్లు, బావుల్లో పెరుగనున్న నీటిమట్టం**

**ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపిన రైతాంగం**



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్‌లో నీటిని నింపాలని కింది ఆయకట్టు గ్రామాల రైతులు ప్రభుత్వ విప్, వేములవాడ వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను కోరగా పంప్‌హౌస్‌లో ఉన్న సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. బుధవారం మిడ్ మానేరు నుంచి పంప్ హౌస్ ద్వారా రిజర్వాయర్ లోకి నీటిని విడుదల చేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున రిజర్వాయర్ వద్దకు వెళ్లి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, డైరెక్టర్లు నాయకులు బొర్ర రవీందర్, బోయిని దేవరాజు, కార్తీక్ గౌడ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌ఓసీ మంజూరు

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన డి.నిశాంత్‌కు అనారోగ్య సమస్యలతో అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కి తెలియజేయగానే ఆయన తక్షణమే స్పందించారు. నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వం నుంచి రూ.1 లక్ష ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేయించారు. తమ సమస్యపై వెంటనే స్పందించి ఎల్‌ఓసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# దివ్యాంగులకు పరికరాల పంపిణీ



**ప్రజానావ, పెద్దపల్లి:** ప్రభుత్వం మహిళా, శిశు, దివ్యాంగులు వయోవృద్ధులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలింకో సౌజన్యంతో పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎంపికైన 198 మంది దివ్యాంగులకు రూ. 27.50 లక్షల విలువ గల ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, చేతి కర్రలు, వినికిడి పరికరాలను, ఇతరత్రా సహాయ ఉపకరణాలను సంక్షేమశాఖ కలిసి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు ప్రశంస పత్రాలతో పాటు బహుమతులను కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులందరికీ సహాయసహకారాలు అందిస్తామన్నారు. పెద్దపల్లి ప్రాంత ప్రజల సౌకర్యార్థం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు నవీకరించడానికి ప్రభుత్వం నుండి 51 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునిక హంగులతో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు డీడబ్ల్యూఓ వేణుగోపాల్, అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



**ప్రజానావ, పెద్దపల్లి:** రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై రోడ్డు, రవాణా శాఖ అధికారులు వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. పెద్దపల్లిలో డిజిటల్ స్క్రీన్ వాహనం ద్వారా రోడ్డు భద్రత నిబంధనలపై వివరించారు. రోడ్డు భద్రత నిబంధనలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని పెద్దపల్లి ఇన్‌చార్జి డీటీఓ ఎస్‌కే మసూద్ అలీ, ఎంవీఐ స్వప్న, ఏఎంవీఐ మధు పిలుపునిచ్చారు. వాహనాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, రావాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

6 గురువారం
9 జనవరి 2025

# రౌడీయిజం చేస్తే తడాఖా చూపిస్తా

**బీజేపీ కరీంనగర్ ఎస్టీ మోర్చా హెచ్చరిక**




**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడికి బయల్దేరిన బీజేపీ ఎస్టీ మోర్చా నేతలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తూ బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా. కళ్యాణ్ నాయక్ పిలుపుమేరకు కరీంనగర్ ఎస్టీ మోర్చా నేతలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ నాయక్, జిల్లా అధ్యక్షుడు కట్ట రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రౌడీయిజం చేసి ఇలాంటి దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదని, మా తడాఖా కూడా చూపెడతామని హెచ్చరించారు. తడాఖా కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఉద్యమం



**ప్రజానావ, పెద్దపల్లి:** ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి మండల ఇన్‌చార్జి అంబాల నరేశ్ నియానకమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా దండోరా ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. ఎస్సీ, ఉప కులాలకు కొండత అండగా ఎమ్మార్పీఎస్ నిలుస్తుందన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూంగా ధర్మాసనం ఇచ్చిన తీర్పు అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ త్వరగా ప్రభుత్వానికి నివేదిక అందజేసి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందులో జాప్యం జరగకుండా ముందుకు సాగాలని ఫిబ్రవరి 7న జరగనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌కు చెందిన పార్వతమ్మ అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ద్వారా దరఖాస్తు చేయించి మృతురాలి కుమార్తె విజయకు రూ. 1.30లక్షల పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు నగేశ్, సాగర్, అబ్దుల్, గని, బెంజిమెన్, మహిళా నాయకురాలు హనుమ కుమారి, సుగుణమ్మ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్వతమ్మ కుటుంబ సభ్యులు మామిడి నర్సింగ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

\- ప్రజానావ, ఖైరతాబాద్



హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని శిశు సంరక్షణ సంస్థలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు బుధవారం ధ్రువీకరణ పత్రాలను( సర్టిఫికెట్ల)ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీ.విజయా రెడ్డి (కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఖైరతాబాద్) పాల్గొన్నారు.

\- ప్రజానావ, ఖైరతాబాద్

# గ్రామీణ యువత జాతీయస్థాయిలో రాణించాలి

- ఆటల్లో గెలుపోటములు సహజం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజానావ, రుద్రంగి:** గ్రామీణ యువత జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రుద్రంగి మండలం మనాల గ్రామంలో బుధవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్, తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు యువతకు సత్సంబంధాలు మెరుగుపర్చలనే ఉద్దేశ్యంతో రుద్రంగి మండలం మానాల గ్రామంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరుస్తూ జిల్లా, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత యువత జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని, ఏ ఆటలోనైనా గెలుపోటములు సహజమే అయినా చివరి వరకు పోరాడాన్నారు. ప్రతి ఒక్కరిలో టీమ్ స్పిరిట్ ఉన్నప్పుడే విజయం చేరువవుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువు, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. యువతకు పోలీస్ సేవలు మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో విన్నూత కార్యక్రమాలు చేపడుతూ జిల్లా ప్రజలకు భరోసా కల్పిస్తున్న పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లైసెన్స్ మేళాలో 100 మంది యువతీ యువకులకు లైసెన్స్ అందజేయడం జరిగిందని, రెండోదశలో సుమారు 700 వరకు లైసెన్స్‌లు అందిచేలా ప్రణాళిక రూపొందించడం అభినందనీయమన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న మానాల గ్రామాన్ని తరచూ సందర్శించడం జరుగుతుందని, ఇటీవల కాలంలో మానాల చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువత చెడు వ్యాసనాల వైపు దారి మళ్లకుండా పోలీస్ సేవలు చేరువ చేయాలని స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ, స్పోర్ట్స్ మీట్ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మానాల గ్రామంలో ఏర్పటు చేసిన మండలస్థాయి వాలీబాల్ పోటీల్లో 13 జట్లు పాల్గొనగా, గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అశోక్, అంజయ్య, క్రీడాకారులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లాలోని మందపల్లి గ్రామంలో ఓ లారీ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రమాదం స్థలం వద్ద ఆగి క్షతగాత్రులను తన వాహనంలో ఎక్కించుకొని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

\- ప్రజానావ, సిద్దిపేట

# వేములవాడలో హిటాచీ ఏటీఎం ప్రారంభించిన ప్రభుత్వ విప్



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని యూనియన్‌కు సమీపంలో (టెంపుల్ రోడ్డు) ఏటీఎంను బుధవారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హిటాచీ ఏటీఎం ఏర్పాటు చేసుకున్న ఎడ్ల కణయ్ కుమార్ అనే యువకుడిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఏటీఎం ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కనికారపు రాకేశ్, కాంగ్రెస్ నాయకులు నాగుల రాము గౌడ్, నేరళ్ల శ్రీధర్ గౌడ్, అంబటి చందు యాదవ్, పబ్బ శ్రీనాథ్ గౌడ్, పోతుగంటి వెంకన్న, బంధు మిత్రులు, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్‌లు పాల్గొన్నారు.



# పెండింగ్ బిల్లులు వెంటనే జమ చేయాలి

**యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్**

**ప్రజానావ, సిరిసిల్ల:** ఏళ్లు గడుస్తున్నా జమకానికి ఉద్యోగుల బిల్లులు, ఉద్యోగ ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో క్లెయిమ్ చేసి డీటీఓ కార్యాలయానికి సమర్పించిన బిల్లులు రెండేళ్లు దాటినా ఉద్యోగుల ఖాతాల్లో జమ కాలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ కుటుంబ అవసరాలకు తమ అనారోగ్య ఖర్చుల కోసం, కూతుర్ల వివాహాల కోసం, గృహ నిర్మాణాలకు క్లెయిమ్ చేసిన మొత్తాలు ఉన్నాయన్నారు. ఇలా పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో సరెండర్ లీవ్, డీఏ ఏరియర్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీపీఎఫ్, పార్ట్ ఫైనల్, సప్లిమెంటరీ శాలరీ బిల్లులు ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ బిల్లుల మంజూరు కోసం రాష్ట్ర ఖజానా శాఖపై ఒత్తిడి తేవాలని డీటీఓను కోరారు. దీనిపై డీటీఓ నవీన్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్ లేఖ రాసి బిల్లులు జమయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా కోశాధికారి అంబటి రమేశ్, జిల్లా కార్యదర్శి ఎలగొండ రవి, వద్యారం మధుసూదన్ పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు చేయూత

- సుల్తానాబాద్ జూనియర్ కాలేజ్ అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



**ప్రజానావ, పెద్దపల్లి:** సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు 45 రోజుల పాటు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తన సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని కాలేజీలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు తన వంతు సహకారం కృషి ఉంటుందన్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా గ్రామీణ ప్రాంతం నుంచి ఉదయం పూట కాలేజీకి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కష్టంగా మారిందని అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొనడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ కాలేజీ పూర్వ విద్యార్థిగా తాను ఈ స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం తన బాధ్యతగా భావిస్తున్నట్టు విజయరమణ రావు తెలిపారు. ప్రభుత్వమే ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ కాలేజ్ అభివృద్ధిలో భాగంగా హై స్కూల్ విభాగం కు నూతన భవనాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు. ఎంసెట్, నీట్ పరీక్షలకు సన్నద్ధం అయ్యే స్టూడెంట్స్ కు అవసరమైన పుస్తకాలను అందిస్తానని చెప్పారు. కాలేజీ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలు ఇతర అన్ని రంగాల్లో రాణించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, ఏఎంసి చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రిన్సిపాల్, లెక్చరర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్



**ప్రజానావ, కరీంనగర్:** బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తుందని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ విమర్శించారు. ప్రభుత్వం తప్పులను ప్రజలకు వివరిస్తే దాడులు, దౌర్జన్యాలు చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు బొంద పెట్టారని, కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందని జోస్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడిని ఈ సందర్భంగా శ్రీనివాస్ ఖండించారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ
# వన్డే టోర్నీకి సన్నాహాలు

## 36 మంది ఆటగాళ్ల జాబితా సిద్ధం!
### బీసీసీఐ సెలక్షన్ కమిటీ తీవ్ర కసరత్తు


ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీకి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీకి సంబంధించిన అన్ని జట్లను జనవరి 12లోగా ప్రకటించేందుకు ఐసీసీ గడువు విధించింది. ఈ గడువు ముగిసిన తర్వాత బీసీసీఐ సెలక్షన్ కమిటీ 36 మంది ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసింది. ఈ 36 మంది ఆటగాళ్ల జాబితా నుంచి 15 మందిని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేస్తారు. కాబట్టి, 21 మంది ఆటగాళ్లు తప్పుకోవడం ఖాయం. అయితే, కొంత మంది ఆటగాళ్లను రిజర్వ్ జాబితాకు ఎంపిక చేసే అవకాశాలను తోసిపుచ్చలేం. రోహిత్ శర్మ (కెప్టెన్), శుభమన్ గిల్, యస్సవి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ. ఐదుగురు స్టార్టర్స్‌తో కూడిన ఈ జాబితా నుంచి ముగ్గురు ఓపెనర్లు ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యే అవకాశం ఉంది. విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, ర్యాన్ పరాగ్, రజత్ పాటిదార్, తిలక్ వర్మ, సాయి సుదర్శన్, రింకు సింగ్ లను మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్స్ గా తీసుకునే అవకాశం ఉంది. ఆల్ రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే లకు చాన్స్ దొరకవచ్చు. కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి పూర్తి స్థాయి స్పిన్నర్లలో ఉన్నారు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అర్ష్దీప్ సింగ్, అవేష్ ఖాన్, హర్షిత్ రాణా, పర్షిద్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, మహ్మద్ షమీలు ఫాస్ట్ బౌలర్ల జాబితాలో చోటు లభించె అవకాశం ఉంది.





## ఇంగ్లండ్‌తో సిరీస్‌కు రోహిత్ శర్మకు విశ్రాంతి!
### గిల్‌కు కెప్టెన్ బాధ్యతలు అప్పగించే అవకాశం

ఆస్ట్రేలియాలో ఘోర పరాజయాన్ని మరచిపోయిన టీమిండియా ఇప్పుడు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌పై కన్నేసింది. జనవరి 22 నుంచి ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 6 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సమయంలో జరిగే వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ భాగం కావడం లేదని, ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు అతనికి విశ్రాంతి ఇవ్వవచ్చని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే, రోహిత్ శర్మ ఆడకపోతే వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారనేది అతిపెద్ద ప్రశ్నగా మారింది. ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించేందుకు జనవరి 12వ తేదీని ఐసీసీ డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంగ్లండ్ సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా బీసీసీఐ జట్టును ప్రకటించవచ్చు. ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ ఆడడం ఖాయం. కానీ, ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో మాత్రం అతను పాల్గొనడం ఖాయం. ఇటువంటి పరిస్థితిలో, రోహిత్ ఈ సిరీస్‌లో ఆడకపోతే, కెప్టెన్సీకి శుభ్‌మన్ గిల్ అతిపెద్ద పోటీదారుగా మారబోతున్నాడు. ఎందుకంటే, ఈ సిరీస్‌లో జస్ప్రీత్ బుమ్రాకు కూడా విశ్రాంతి ఇవ్వడం దాదాపు ఖాయం. టీ20 ప్రపంచ కప్ 2024 తర్వాత జింబాబ్వే పర్యటనలో టీ20 జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తరువాత, అతను శ్రీలంక పర్యటనలో టీ20, వన్డే జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. సాధారణంగా, కెప్టెన్ ఆడనప్పుడు, వైస్ కెప్టెన్‌కు జట్టు కమాండ్ ఇవ్వనున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో కెప్టెన్ రేసులో శుభ్‌మన్ గిల్ ముందు వరుసలో ఉండబోతున్నాడు. గౌతమ్ గంభీర్ కోచ్ అయిన తర్వాతే శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. శుభ్‌మన్ గిల్‌తో పాటు హార్దిక్ పాండ్యా కూడా కెప్టెన్సీకి పెద్ద పోటీదారు. ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని ఇంగ్లండ్ సిరీస్ నుండే వన్డేల్లో పునరాగమనం చేస్తాడని విశ్వసిస్తోంది. ఇటువంటి పరిస్థితిలో, అతనికి కెప్టెన్సీ బాధ్యత కూడా ఇవ్వవచ్చు. హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ అనుభవం చాలా ఉంది. 2022 టీ20 ప్రపంచకప్ నుంచి టీ20 జట్టు కమాండ్‌ని నిర్వహిస్తున్నాడు. అయితే, తాజాగా సూర్యకుమార్ యాదవ్‌ను టీ20కి కెప్టెన్‌గా నియమించారు. అయితే, సూర్య వన్డే జట్టులో భాగం కావడం లేదు. దీంతో పాండ్యాకు కూడా కెప్టెన్‌గా అవకాశం దక్కనుంది. మరోవైపు, కేఎల్ రాహుల్ కూడా కెప్టెన్సీకి పోటీదారు కావచ్చు. కానీ, అతను ఈ రేసులో గిల్, పాండ్యా కంటే చాలా వెనుకబడ్డాడని తెలుస్తోంది.



## ఐపీఎల్‌కు బుమ్రాను దూరంగా ఉంచాలి!
### బుమ్రాకు క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ సూచన

టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఐపీఎల్ 2025 సీజన్ ఆడకుండా నిషేధం విధించాలని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి సూచిస్తున్నారు. భారత టెస్ట్ క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. మరోవైపు టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా కొనసాగాలన్నా.. సుదీర్ఘ కాలం సంప్రదాయక ఫార్మాట్ ఆడాలన్నా బుమ్రా.. ఐపీఎల్‌కు దూరంగా ఉండి ఫిట్‌నెస్ కాపాడుకోవాలని సూచిస్తున్నారు. ఇటీవలే ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 5 టెస్ట్‌ల్లో 9 ఇన్నింగ్స్‌ల్లో 32 వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌లో టీమిండియా 1-3తో ఓటమిపాలైనా బుమ్రా అసాధారణ ప్రదర్శనతో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ అందుకున్నాడు. బౌలర్‌గానే కాకుండా కెప్టెన్‌గా సత్తా చాటాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియాకు సారథ్యం వహించిన బుమ్రా.. అద్భుత కెప్టెన్సీతో విజయాన్నందించాడు. చివరి టెస్ట్‌లోనూ కెప్టెన్సీ చేపట్టిన బుమ్రా దురదృష్టవశాత్తు వెన్ను నొప్పితో మ్యాచ్ మధ్యలోనే టోర్నీ నుంచి తప్పుకున్నాడు. లేకుంటే ఈ మ్యాచ్‌లో కూడా టీమిండియాను గెలిపించేవాడు. బుమ్రా అద్భుత కెప్టెన్సీ నేపథ్యంలో అతన్ని టెస్ట్ కెప్టెన్‌గా నియమించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అయితే బుమ్రా తరుచూ గాయాలబారిన పడుతుండటం ఇప్పుడు సమస్యగా మారింది. ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలా తరుచూ గాయాలబారిన పడితే టీమిండియాకు తీవ్ర నష్టం చేయనుంది. ఈ క్రమంలోనే బుమ్రా.. ఐపీఎల్‌కు దూరంగా ఉండి ఫిట్‌నెస్ కాపాడుకోవాలని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ఆస్ట్రేలియాతో ఆఖరి టెస్ట్‌లో వెన్ను నొప్పితో బాధపడిన బుమ్రా ఫిట్‌నెస్‌పై స్పష్టమైన సమాచారం లేదు. ప్రస్తుతం అతనికి విశ్రాంతి ఇచ్చారు. ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లకు కూడా అతను దూరంగా ఉండనున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో నేరుగా బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే బుమ్రా వెన్ను గాయం తీవ్రత ఎక్కువగా ఉందని, ఛాంపియన్స్ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లకు కూడా అతను దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని తాజాగా వార్తలు వచ్చాయి. అదే జరిగితే ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు కష్టాలు తప్పవు. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు పాకిస్థాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జరగనుండగా.. టీమిండియా మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది.

## ఉమెన్స్ ప్రీమియర్ లీగ్
# మూడవ ఎడిషన్‌కు సిద్ధం

### డబ్ల్యూపీఎల్ వేదికలను షార్ట్‌లిస్ట్ చేసిన బీసీసీఐ

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండు సీజన్లు పూర్తయ్యాయి. ఇప్పుడు ఇది మూడవ ఎడిషన్‌కు సిద్ధమైంది. 2025 కోసం వేలం ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు టోర్నీ ప్రారంభం కావడమే ఆలస్యం. వేలం తర్వాత, బీసీసీఐ కూడా డబ్ల్యూపీఎల్ వేదికలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తాజా నివేదిక ప్రకారం, ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 6 లేదా 7 నుంచి ప్రారంభమవుతుంది. ఈసారి బరోడా, లక్నోలలో మ్యాచ్‌లు ఆడవచ్చు. అయితే తేదీ, వేదికపై బీసీసీఐ ఇంకా ఎలాంటి అధికారిక సమాచారాన్ని పంచుకోలేదు. బీసీసీఐ, డబ్ల్యూపీఎల్ మూడవ సీజన్ కోసం బరోడా, లక్నోలను షార్ట్‌లిస్ట్ చేసింది. టోర్నీని నిర్వహించేందుకు యూపీ క్రికెట్ అసోసియేషన్, బరోడా క్రికెట్ అసోసియేషన్‌తో చర్చలు ప్రారంభించింది. త్వరలో ఈ రెండు నగరాలను కూడా భారత బోర్డు అధికారికంగా వేదికలుగా ప్రకటించనుంది. నివేదిక ప్రకారం, డబ్ల్యూపీఎల్ రెండవ దశ బరోడాలో ప్లాన్ చేసింది. టోర్నమెంట్ చివరి మ్యాచ్ మార్చి 8 లేదా 9 న ఆడవచ్చు. బరోడా దీనికి ఆతిథ్యం ఇవ్వవచ్చు. బరోడా ఇటీవల కోటంబి స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను కల్పించింది. ఆ తర్వాత ఈ మైదానంలో భారత్, వెస్టిండీస్ మహిళల జట్లు 3 వన్డే మ్యాచ్‌లు ఆడింది. ఇది కాకుండా, సీనియర్ మహిళల టీ20 టోర్నమెంట్‌లో చాలా మ్యాచ్‌లు కూడా ఈ మైదానంలో జరిగాయి. కొన్ని రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు కూడా జరిగాయి. ఇప్పుడు భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ కొన్ని నాకౌట్ మ్యాచ్‌లు కూడా ఆతిథ్యం ఇచ్చింది. కొత్త సౌకర్యాలను పరీక్షించ దానికి, విజయ్ హజారే ట్రోఫీ సెమీ-ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను కూడా బరోడాలో




నిర్వహించవచ్చు. అందుకే ఇప్పుడు బీసీసీఐ దీన్ని డబ్ల్యూపీఎల్ వేదికగా ఎంపిక చేసింది. డబ్ల్యూపీఎల్ 2025లో, టోర్నమెంట్‌లోని 5 జట్లు ఛాంపియన్‌లు కావాలనే ఉద్దేశ్యంతో ప్రవేశిస్తాయి. గత ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉంది. బెంగళూరు తన టైటిల్‌ను తిరిగి పొందాలనుకుంటున్నది. అయితే, ఇతర జట్లు ఈ టైటిల్‌ను గెలుచుకోవాలనుకుంటున్నాయి. ఇందుకోసం రెండు దశల్లో మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి. బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో మిగిలిన పనిని పూర్తి చేయడానికి కొంత సమయం కావాలి. కాబట్టి, రెండవ దశను నిర్వహించాలని బీసీసీఐని కోరింది. టోర్నమెంట్ మొదటి సీజన్ పూర్తిగా ముంబైలో ఆడింది. రెండో సీజన్‌లో బెంగళూరు, ఢిల్లీలో మ్యాచ్‌లు జరిగాయి.

# తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం

### గత సీజన్ లో స్లో ఓవరేట్ కారణంగా బెంచ్‌కే పరిమితం

ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందే ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరంగా ఉండనున్నాడు. అప్‌కమింగ్ సీజన్‌లో తమ సారథిగా హార్దిక్ పాండ్యానే కొనసాగుతాడని ఇప్పటికే ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. మార్చి 13 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే ఐపీఎల్ ఓవర్ రేట్ రూల్స్ ప్రకారం ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం కానున్నాడు. గత సీజన్(ఐపీఎల్ 2024)లో ముంబై ఇండియన్స్ సారథిగా హార్దిక్ పాండ్యా వరుసగా మూడు సార్లు స్లో ఓవరేట్‌కు గురయ్యాడు. నిర్ణీత సమయంలో తమ జట్టు ఓవర్లను పూర్తి చేయలేకపోయాడు. దాంతో అతనిపై ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం పడింది. స్లో ఓవర్ రేట్ విషయంలో ఆటగాళ్లు సీరియస్‌గా ఉండటం లేదని గ్రహించిన ఐపీఎల్ నిర్వాహకులు కఠిన నిబంధనలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. మొదటి సారి స్లో ఓవర్‌రేట్‌కు గురైతే కెప్టెన్ మ్యాచ్ ఫీజులో 12 లక్షలు కోత విధిస్తారు. రెండో సారి ఇదే తప్పిదం రిపీట్ అయితే రూ. 24 లక్షలు, మూడో సారి రిపీట్ అయితే రూ. 30 లక్షల మ్యాచ్ ఫీజు కోతతో పాటు ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం విధిస్తారు. అయితే హార్దిక్ పాండ్యా గత సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మూడోసారి స్లో ఓవర్ రేట్‌కు కారణమయ్యాడు. దాంతో అతను అప్‌కమింగ్ సీజన్ తొలి మ్యాచ్ ఆడకుండా నిషేధం పడింది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు హార్దిక్ పాండ్యాను ముంబై ఇండియన్స్ రిటైన్ చేసుకున్న సంగతి తెలిసిందే. అతనితో పాటు రోహిత్ శర్మ,




జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మలను ముంబై అంటిపెట్టుకుంది. ఈ కోర్ టీమ్‌కు తగ్గట్లుగా వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేసింది. పేపర్‌పై ముంబై ఇండియన్స్ చాలా బలంగా కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరంకానున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ తాత్కలిక కెప్టెన్‌గా ఎవరు బాధ్యతలు చేపడుతారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. హార్దిక్ గైర్హాజరీలో టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఐపీఎల్ 2023 సీజన్‌లో రోహిత్ శర్మ డిప్యూటీగా సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్‌ను నడిపించాడు. ఆ మ్యాచ్‌లో రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు.



## హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్న తీక్షణ
### ఏడో శ్రీలంక బౌలర్‌గా రికార్డు

శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ చరిత్ర సృష్టించాడు. వన్డే క్రికెట్‌లో హ్యాట్రిక్ వికెట్ సాధించిన ఏడో శ్రీలంక బౌలర్‌గా రికార్డ్ సాధించాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం హామిల్టన్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో తీక్షణ ఈ ఫీట్ సాధించాడు. వర్షం అంతరాయం కలిగిన ఈ మ్యాచ్‌లో తీక్షణ రెండు ఓవర్ల సాయంతో హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. వరుసగా మూడు బంతుల్లో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ స్టార్క్, నాథన్ స్మిత్, మ్యాట్ హెన్రీలను ఔట్ చేశాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 35వ ఓవర్ చివరి రెండు బంతులకు మిచెల్ సాంట్నర్, నాథన్ స్మిత్‌లను ఔట్ చేసిన తీక్షణ.. 37వ ఓవర్ తొలి బంతికి మ్యాట్ హెన్రీని పెవిలియన్ చేర్చి హ్యాట్రిక్ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. తీక్షణ కంటే ముందు శ్రీలంక తరఫున చమింద వాస్(2001, 2003),లసిత్ మలింగా(2007), ఫర్వేజ్ మహరూఫ్(2007), లసిత్ మలింగా(2011), తిసారా పెరెరా(2012), వానిందు హసరంగా(2017), దుష్మంత్ మధుషంక(2018)లు వన్డే క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించారు. ఈ మ్యాచ్‌లో మొత్తం 8 ఓవర్లు బౌలింగ్ చేసిన తీక్షణ 44 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. తీక్షణ హ్యాట్రిక్ తీసిన ఈ మ్యాచ్‌లో శ్రీలంకకు పరాజయం తప్పలేదు. 113 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. 37 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 9 వికెట్లకు 255 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర(63 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 79), మార్క్ ఛాప్‌మన్(52 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం శ్రీలంక 30.2 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌటైంది. కామిందు మెండిస్(66 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64) హాఫ్ సెంచరీతో రాణించాడు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

సినిమా
CINEMA

8
గురువారం
9 జనవరి 2025

# నేను ఎవరినీ ఉద్దేశించి అలా వ్యాఖ్యలు చేయలేదు

## : రాజేంద్రప్రసాద్



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇటీవల అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఓ సినిమా ప్రమోషన్ ఈవెంట్‌లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. వాడెవడో ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే దొంగ (పుష్ప సినిమాలో అల్లు అర్జున్ పాత్ర).. వాడు హీరో.. ప్రస్తుతం హీరోల్లో అర్థాలు మారిపోయాయి.. నాకున్న అదృష్టం ఏంటంటే 48 సంవత్సరాలుగా నేను సమాజంలో మన చుట్టూ ఉన్న ట్వంటి పాత్రలతో డిఫరెంట్ హీరో అనిపించుకున్నా.. అంటూ కామెంట్ చేశాడు. అయితే నటకిరీటి చేసిన వ్యాఖ్యలు ముదరడంతో తర్వాత క్లారిటీ ఇచ్చాడు. తాను అల్లు అర్జున్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయలేదని తెలిపాడు. అల్లు అర్జున్ నా కొడుకు లాంటి వాడు. అతడిని అలా అంటానా. అంటూ రాజేంద్రప్రసాద్ తెలిపాడు. దీంతో ఈ వివాదం సద్దుమణిగింది. ఇదిలావుంటే.. ఈ విషయంపై మరోసారి స్పందించాడు రాజేంద్రప్రసాద్. ఈ విషయంపై నేను ఇటీవల అల్లు అర్జున్‌ని కలిశాను. అయితే బన్నీ మాట్లాడుతూ.. మీరు ఆ మాటలు అనలేదని నాకు తెలుసు అన్నాడు. పిచ్చోడా నేనే అన్నాను అని చెప్పాను. దానికి బన్నీ మీరు అన్నది తెలుసు. కానీ మీరు వేరే ఉద్దేశ్యంతో అనలేదు అని తెలిపాడు. సరిగ్గా చెప్పావు. నా ఉద్దేశ్యం అది కాదు. ఇప్పుడు సోషల్ మీడియా ఎలా తయారయ్యింది అంటే.. నేను నాకు తెలిసిన ఒక మీడియా మిత్రుడిని అడిగాను. నేను మాట్లాడింది ఒకటి అయితే నువ్వు టైటిల్ వేరే ఎందుకు పెట్టావు అని నిలదీయగా.. వాడు అలా థంబ్‌నెల్స్ లేకపోతే ఎవరు చూడట్లేదని తెలిపాడు. దీంతో నేను షాక్ అయ్యాను. ఇలా చేయడం వలన తెలికుండానే నెగిటివ్‌గా పోతున్నాయి. అంటూ రాజేంద్ర ప్రసాద్ చెప్పుకొచ్చాడు.

# ఇలాంటి క్యారెక్టర్ ఇప్పటివరకూ చేయలేదు..

## ఐశ్వర్య రాజేష్ ఆసక్తికర కామెంట్స్



విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో రాబోతున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దీనిని మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేకరుల సమావేశంలో పలు విశేషాల్ని పంచుకున్నారు. "భాగ్యం క్యారెక్టర్ కోసం చాలా వెతికారు. ఆ పాత్ర నాకు దక్కడం ఆనందంగా వుంది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. కానీ 'సంక్రాంతికి వస్తున్నాం' చాలా స్పెషల్. తెలుగులో నాకు ఇప్పటివరకూ సరైన డ్యూయెట్ సాంగ్ పడలేదు. ఆ లోటు గోదారి గట్టు పాటతో తీరింది. వెంకటేష్ లాంటి బిగ్ హీరోతో ఇంత అద్భుతమైన సాంగ్ చేయడం అది ఇంత వైరల్ హిట్ కావడం ఆనందంగా ఉంది. ఇది అందరూ ఎంజాయ్ చేసే సినిమా. బిగినింగ్‌లో చాలా భయం వేసింది. ఎందుకంటే భాగ్యం.. మామూలు క్యారెక్టర్ కాదు. కత్తిమీద సాములాంటి క్యారెక్టర్. కొంచెం బ్యాలెన్స్ తప్పినా కష్టమే. ఇంతకుముందు ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు. ఆడియన్స్ చూస్తున్నప్పుడు జాలి పుట్టే క్యారెక్టర్. చాలా క్రూసియాల్ రోల్. కాస్త శ్రుతిమించిన ఓవర్ డోస్ అయిపోతుంది. భాగ్యం పాత్రని అర్థం చేసుకోవడానికి నాకు పదిరోజులు పట్టింది" అని చెప్పుకొచ్చింది.

# రజినీ కూలీ సినిమా వాయిదా



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం కూలీ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. తలైవా నెక్స్ట్ షూటింగ్ షెడ్యూల్ కోసం థాయ్‌లాండ్‌కు కూడా పయనమయ్యాడు. కూలీ 70 శాతం షూటింగ్ పూర్తయిందని.. నెక్స్ట్ షెడ్యూల్ జనవరి 13 నుంచి జనవరి 28 వరకు కొనసాగుతుందని కూడా చెప్పాడు. కూలీ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే కూలీ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ మూవీని ఆగస్టు 14న విడుదల చేస్తున్నారంటూ ఓ అప్‌డేట్ ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇదే నిజమైతే ఇంతకీ కారణమై ఉంటుందనేది తెలియాల్సి ఉంది. మరి దీనిపై మేకర్స్ ఏదైనా స్పష్టత ఇస్తారేమో చూడాలి. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ వార్ 2 కూడా ఇదే రోజు విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. లోకేశ్ కనగరాజ్ టీం ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్ షూట్ షెడ్యూల్‌లో భాగంగా సంబార్ లేక్ ప్రాంతంలో అమీర్ ఖాన్, ఉపేంద్ర, తలైవా, రెబా మోనికా జాన్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారిన తెలిసిందే. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# ఎమర్జెన్సీ సినిమాకు ప్రియాంకాగాంధీని ఆహ్వానించిన కంగనా రనౌత్



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ'. దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో ఇందిరాగాంధీగా కంగనా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. అనుకోని కారణాల వలన వాయిదా పడింది. అయితే రీసెంట్‌గా సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జనవరి 17న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను కూడా పంచుకుంది. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా 10 రోజులే ఉండడంతో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది కంగనా. ఈ క్రమంలోనే 'ఎమర్జెన్సీ' సినిమాను చూడాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని ఆహ్వానించినట్లు కంగనా తెలిపింది. పార్లమెంటులో ప్రియాంక గాంధీని కలిశాను. ఆమెని కలిసిన అనంతరం నేను చెప్పిన మొదటి మాట.. ఆప్కో ఎమర్జెన్సీ దేఖ్నీ చాహియే (మీరు ఎమర్జెన్సీ సినిమాని చూడాలి). మీకు ఇది బాగా నచ్చుతుంది అంటూ ప్రియాంకాకు చెప్పాను. అయితే ఈ విషయంలో ప్రియాంక కూడా సున్నింతంగా స్పందిస్తూ.. అవును కావచ్చు అంటూ తెలిపినట్లు కంగనా చెప్పుకొచ్చింది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రియాంకకు నాన్నమ్మ అవుతుందన్న విషయం తెలిసిందే. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇందిరా గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో 1975 నుంచి 1977 వరకు 21 నెలల పాటు 'ఎమర్జెన్సీ' విధించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో భారత ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోన్నారు. మీడియా ఎలా అణచివేయబడింది. వంటి యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాను జీ స్టూడియోస్, మణికర్ణిక ఫిలిమ్స్ బ్యానర్లు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి, మిలింద్ సోమన్, శ్రేయాస్ తల్పాడే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# విలన్‌గా మారిన స్టార్ హీరో



ప్రస్తుతం అన్ని ఇండస్ట్రీలలోను సీనియర్ స్టార్ హీరోలు విలన్ల అవతారమెత్తుతున్నారు. కొందరు లీడ్ రోల్ ఆఫర్స్ రాకపోవడంతో, మరికొందరు నటనలో వైవిధ్యతను చూపించేందుకు విలన్లుగా అవతారమెత్తి ఇండస్ట్రీలో ఎక్కువ కాలం ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా దక్షిణాదికి చెందిన ఓ స్టార్ హీరో ఇప్పుడు విలన్ అవతారమెత్తాడు. ఇంతకీ ఆ హీరో ఎవరంటే.. జాతీయ అవార్డు విజేత, దర్శకురాలు సుధా కొంగర ప్రస్తుతం తమిళ్ యాక్టర్ శివ కార్తికేయన్ 25వ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం విలన్ గా స్టార్ యాక్టర్ 'జయం రవిని' పరిశీలించారు. దీనికి ఆయన ఓకే కూడా చెప్పేశాడు. ఇదంతా ఎలా జరిగింది అనే అనుభవాన్ని హీరో శివ కార్తికేయన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ఆయన మాట్లాడుతూ.. "ఇందులో అత్యంత ఆసక్తికరమైన విషయం జయం రవి సర్ విలన్ పాత్ర చేయడం. ఇది చాలా బలమైన పాత్ర. ఆయన 'యస్... ఈ సినిమా చేస్తున్నాను' అని చెప్పినప్పుడు నాకు ఎంతగానో సంతోషంగా అనిపించింది. ఎందుకంటే, నేను కాలేజీలో ఉన్నప్పుడే ఆయన సినిమాలు చూడడం ప్రారంభించాను. నా కాలేజ్ డేస్ సమయంలో ఆయన సినిమా రంగంలోకి ప్రవేశించారు. చిత్ర పరిశ్రమలో ఆయన నాకు సీనియర్. ఆయన సినిమాలను ఎంతో ఆస్వాదించాను. ఇప్పుడు ఆయనతో కలిసి నటించడం, ఒకరిపై ఒకరు పోరాడే సన్నివేశాల్లో నటించడం చాలా ఉత్సాహంగా ఉంది. ఇక సుధా మేడమ్ చాలా శ్రద్ధగా ప్రణాళికలు సిద్ధం చేస్తారు. అందుకే ఏ ప్రశ్నలు అడగాల్సిన అవసరం ఉండదు. ఆమె ఎప్పుడూ ఎనర్జీతో ఉంటారు" అన్నారు సినిమా థియేటర్లు "మేం ఈ సినిమాకి షూటింగ్ ప్రారంభించాం. రెండు రోజుల క్రితం ప్రోమో షూట్ జరిగింది. ఇంకా షూటింగ్ కొనసాగుతోంది. ఇది పెద్ద స్థాయిలో తెరకెక్కుతున్న పీరియడ్ డ్రామా. ఇది మరింత భారీ స్థాయిలో ఉంటుంది. ఈ సినిమాలో శ్రీలీల, అథర్వా నటిస్తున్నారు. జి.వి. ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. రవి కె. చంద్రన్ గారు సినిమాటోగ్రాఫీ చేస్తున్నారు. మరోవైపు ఏఆర్ మురుగదాస్ గారితో చేస్తున్న నా సినిమా 90 శాతం పూర్తయ్యింది. మిగిలిన 10 శాతం, సల్మాన్ ఖాన్ తో తీస్తున్న సినిమా షూటింగ్ ముగించుకుని మురుగదాస్ గారు తిరిగి వచ్చిన తర్వాత పూర్తి చేస్తాం" అని చెప్పుకొచ్చారు.

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**